# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి 1991 రు.2/-



# మిసిమి

***"All that we are is the product of what we have thought," is "We are what we think."*** **– Dammapada.**

సంపుటి 2 | ఫిబ్రవరి 1991 | సంచిక 19

## విషయసూచిక

డాక్టర్. జి.వి. కృష్ణరావు సాహిత్యంలో
వ్యక్తి చేతన
— హితశ్రీ

బొందితో స్వర్గం
— అన్వేషి

మేధావుల మెతకలు-2
జాన్ పాల్ సార్త్ర
— అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అనార్కలీ
(సలీం ప్రియురాలు కాదు)
— సంజీవదేవ్

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

*Who verily knows and who can here declare it, whence it was born and whence comes this creation?*

*The gods are later than this world's production. Who knows, then, whence it first came into being.*

*He, the first origin of this creation, whether he formed it all or did not form it.*

*Whose eye controls this world in highest heaven, he verily knows-it or perhaps he knows it not.*

– Rig Veda, The Song of Creation.

## 'Universe was created by an explosion'

*Einstein once wrote, "You believe in a God who plays dice and I in complete law and order." But law and order is never complete in this universe where chaos is woven together with order, writes Ian Stewart, author of Does God Play Dice?*

Canadian physicists said yesterday that they have compelling proof that the universe was created by a huge explosion 20 billion years ago, commonly known as the big bang, reports Reuter.

The scientists said their data, gathered by a space probe, were the most precise ever made of cosmic background radiation, the explosion's faint afterglow.

"We've made life very difficult for any non-big bang theory," said Physics Professor Mark Halpern of University of British Columbia.

The big bang theory holds that the universe started with a sudden expansion from an extremely dense and hot starting point.

Faint traces of radiation from this event were first discovered in 1965 by Nobel Prize-winning American physicists, Arno Penzias and Robert Wilson, using a radio telescope.

# డాక్టర్ జి.వి. కృష్ణరావు సాహిత్యంలో

# వ్యక్తి చేతన

— రచన: హితశ్రీ

తెలుగు సాహిత్యంలో వ్యక్తిని గురించీ, వ్యక్తి కర్తవ్యాన్ని గురించీ, సమగ్ర వ్యక్తిత్వ పూర్ణోదయాన్ని గురించీ తీవ్ర జిజ్ఞాసను రేకెత్తించిన ఏకైక రచయిత డాక్టర్ జి.వి. కృష్ణరావు గారు. కృష్ణరావు గారి జీవితాన్ని, సాహిత్యాన్ని పరిశీలిస్తే మానవుడి స్వాతంత్ర్యానికి సంబంధించిన ఒక తాత్విక దృక్పథం వారి జీవితాన్నీ, సాహిత్యాన్ని కూడా ప్రబలంగా ప్రభావితం చేసిందని స్పష్టమవుతుంది.

కృష్ణరావు గారిని ఉగ్రూత లూపి, ఊపి రాడకుండా చేసిన ప్రధాన భావన వ్యక్తి చేతన. వ్యక్తి సామాజిక జీవి, ఆర్థిక జీవి, రాజకీయ జీవి, సాంస్కృతికజీవి. ఈ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక శక్తులు మానవుడిని ఎలా శాసిస్తున్నాయి? వీటిని మానవుడు ఎలా ఎదుర్కొంటు న్నాడు? గాలికి వంగిపోయే రెల్లుగడ్డి అవుతున్నాడా? సీసాల్లో ద్రవంగా మారిపోతున్నాడా? పర్వత శిఖరంలా నిలబడుతున్నాడా? మబ్బుల్ని చెదరగొట్టే ప్రభంజనమవుతున్నాడా? పిట్టలా ఎగిరి పోతున్నాడా? గుడే పదిలమనుకుంటున్నాడా? అడవిలో మానవుతున్నాడా? గిరి గీసుకు కూర్చుంటున్నాడా? అసలు మానవుడు ఎలా ప్రవర్తించాలి? మానవుడి స్వభావం ఏమిటి? అతని లక్షణం ఏమిటి? కర్తవ్యం ఏమిటి?

ప్రేరణలకి స్పందించటం తప్ప వేరే మానవ స్వభావం అనేదేం లేదని ఒక వాదం. మానవుడు పరిస్థితుల వారసుడు, పరిస్థితులని బట్టి ఒక వ్యక్తి దొంగ కావచ్చు, ఋషి కావచ్చు అని ప్రవర్తనవాదం అంటుంది. తత్వశాస్త్ర దృష్ట్యా, సహజ వాదమూ ఇలాంటిదే. కారణం నించి కార్యం. భౌతిక, జీవశాస్త్ర, రసాయనిక శక్తులవల్ల జీవితం నిర్ణయమవుతుంది. విశ్వమంతా అంతే. ఇంకా కారణాన్ననుసరించి మనిషి జంతువులా యాంత్రికంగా ప్రవర్తించటమే కాని స్వేచ్ఛాచరణకి అవకాశం లేదు. ఆదర్శవాదం కూడా మానవుడి స్వేచ్ఛాభీష్టాలని సర్వమానవ శ్రేయానికి లోబరిచింది. మానవులంటే ఒక సర్వసాధారణ దైవాంశపంచుకొన్న వాళ్లు కనుక ఏ మానవుడి స్వేచ్ఛ అయినా సర్వ మానవ శ్రేయోసాధనకి పరిమితం. లక్ష్యవాదం, లేదా సాధనవాదం వస్తువుల భావన వాటి ఫలితాల భావనకంటె వేరు కాదనీ, అనుకొన్న లక్ష్యం ఏ సాధన సాధిస్తే అదే సత్యమనీ అంటున్నది. ప్రతికూల వాతావరణాన్ని మానవుడు అనుకూలంగా మలచుకొంటాడనీ, స్వేచ్ఛాయుత వాతావర

ణంలో సమాలోచన సత్ఫలితాలనిస్తుందనీ లక్ష్యవాదుల నమ్మకం. ఇక అస్తిత్వవాదం తక్షణానుభవమే మానవుడి లక్ష్యమనీ, తద్వారా మాత్రమే నిజమైన అస్తిత్వాన్ని అనుభూతి పొందుతాడనీ, ఇలాంటి అనుభూతి పూర్తిగా ఆత్మాశ్రయ స్థితిలోనే జరుగుతుందనీ, ఈ స్థితిలో తనని ఏకాకిగా తెలుసుకొంటాడనీ అంటుంది. తనని ఏకాకిగా తెలుసుకోటమే నిజమైన స్వేచ్ఛ, ఇదే అన్ని నైతిక విలువలకీ ఆధారం. అసలు మానవుడే విశ్వానికి కేంద్రం. మిగతావన్నీ అతనికి అనుబంధించినవి. మానవ వ్యక్తి ప్రధాన లక్షణం ఏ బంధాలులేని స్వేచ్ఛ. సమాజం మానవ వ్యక్తి కోసం ఉన్నది కాని అతను సమాజం కోసం కాదు అంటారు అస్తిత్వవాదులు. వ్యక్తిని కాక వర్గాలని మాత్రమే గుర్తిస్తూ మార్క్సిజం మానవుడిని కేవలం ఆర్థిక దృష్టితోనే అర్థం చేసుకొంటుంది.

ఇలా మానవుడిని గురించీ, అతని స్వభావాన్ని, ప్రవర్తనని, అస్తిత్వాన్ని, స్వేచ్ఛని గురించీ వివిధాభిప్రాయాలున్నాయి. వ్యాఖ్యానాలున్నాయి. వీటి బాగోగుల్ని యుక్తియుక్తంగా చర్చించటం ఆలోచనా పరుల కర్తవ్యం. అనుభవాలకి స్పందించి, అంతః స్ఫూర్తి పొంది, ఆ వెలుగులో ఒక తాత్విక దృక్పథంతో మానవుడి స్థితిని గురించీ మానవవ్యక్తి కర్తవ్యాన్ని గురించీ తాను దర్శించిన సత్యాన్ని కళాత్మకంగా నిజాయితీతో ప్రదర్శించటం రచయిత బాధ్యత, కర్తవ్యం.

డాక్టర్ జి.వి. కృష్ణరావు గారు సృజనాత్మక రచయితగా ఈ బాధ్యతను అపూర్వంగా నిర్వర్తించిన విషయాన్ని దిఙ్మాత్రంగా ప్రస్తావించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

కృష్ణరావుగారు మొదటినుంచీ రాజకీయాలకి తీవ్రంగానే స్పందించారు. మొదట్లో మార్క్సిజం ప్రభావానికి లోనయ్యారు. ఆ దృక్పథంతో కొన్ని రచనలు కూడా చేశారు. ఆ తరువాత ఆనాటి మేధావుల్ని ఆకర్షించిన ఎం.ఎన్. రాయ్ రాడికల్ డెమోక్రటిక్ పార్టీ వీరిని ఆకర్షించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రాయ్ చెప్పినట్లు ప్రపంచ ప్రజాస్వామ్యం ఫాసిస్ట్ రాజ్యాలను ఓడించటంతో భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించాలి. ఆ సందర్భంలో రాడికల్ డెమొక్రటిక్ పార్టీ డెహ్రాడూన్‌లో ఏర్పాటు చేసిన రాజకీయ మహాసభకి కృష్ణరావు గారు హాజరయ్యారు. అది తన జీవితంలో ఒక పెద్ద మలుపు అని కృష్ణరావు గారు ''నా సాహిత్య యాత్ర'' అనే వ్యాసంలో ఉదహరించారు. ఆ సమావేశంలో ఎం.ఎన్. రాయ్ రాజకీయ పక్షాలు అధికార కాంక్షతో మానవ స్వాతంత్ర్యాన్ని ఎలా భక్షిస్తాయో వివరించాడు. కమ్యూనిజాన్ని నిశితంగా విమర్శించి పక్షరహిత ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించే నవ్యమానవ వాదాన్ని నిరూపించాడు. కృష్ణరావు గారికి అదంతా యుక్తియుక్తంగానే కనిపించి దిగ్భ్రాంతి కలిగింది. ఈ సంగతి తను ఎందుకు ముందుగానే ఆలోచించ లేదు? ''నాయకులు చెప్పే ప్రతి మాటకూ తల ఆడించటమేనా నా పని? గంగిరెద్దుకూ నాకూ తేడా ఏమిటి?'' అని వ్యథ చెందారు. స్వతంత్ర విచారానికి తాత్విక చింతన అవశ్యకమని భావించి ప్రాచ్య పాశ్చాత్య తత్వశాస్త్రాల్ని మథించారు. ప్లేటో ఆదర్శవాదం, కాంట్ పరతత్వ

వాదం, డ్యూయీ లక్ష్యవాదం, సార్త్ర్ అస్తిత్వవాదం, ఆర్య నాగార్జునుడి శూన్యవాదం కృష్ణరావుగారి ఆలోచనల్ని ప్రబలంగా కదిలించినట్లు తోస్తుంది. అయితే కృష్ణరావు గారు చివరి దాకా తమ భావాల్లోనూ, నిజ సన్నివేశాల్లోనూ స్వతంత్రులుగానే ఉండి పోయారు. ఏ విషమ పరిస్థితిలోనూ తను నమ్మిన విలువల్ని త్యజించలేదు. ఏ భయానికీ, ఏ లోభానికీ వారి వ్యక్తిత్వం తలవంచ లేదు.

జీవితానుభవాలూ, తాత్త్విక చింతనా కృష్ణరావు గారి భావప్రపంచంలో కలిగించిన తీవ్ర సంచలనం వారిలో వ్యక్తి చేతనని ప్రజ్వరిల్ల చేసింది. వారి కీర్తి పతాకాన్ని రెపరెప లాడించే ''కీలు బొమ్మలు'', ''పాపి కొండలు'' నవలల్లో, ''బొమ్మ ఏడ్చింది'' నాటకంలో స్పష్టంగా, ''ఆదర్శ శిఖరాలు'' నాటికా సంపుటిలోని నాటికల్లో స్పష్టాస్పష్టంగా గోచరించేది వ్యక్తి భావనే, వ్యక్తి ప్రాధాన్యతే, వ్యక్తి దృఢీకరణావశ్యకతే వ్యక్తిలో వ్యక్తిచేతనని ఉద్దీపింప చేసి, వ్యక్తి ధర్మాన్ని సుప్రతిష్ఠితం చెయ్యటమే కృష్ణరావు గారి సాహిత్యంలో ప్రధానాంశంగా పరిశీలకులకి వెల్లడవుతుంది. ''ధర్మమనేది కేవలం కర్మక్షేత్రానికి సంబంధించినది. మానవుని పరమార్థంగా స్వీకరించి ఆత్మనాశనానికి పాల్పడక వివేకంతో తనకు తానుగా అంతఃకరణం నిశ్చయించిన కర్మ ధర్మం'' అని, ''రాజకీయాలు - రచనలు'' అనే వ్యాసంలో కృష్ణరావుగారే నిర్వచించారు. ప్రతికూల శక్తులకి తల ఒగ్గకుండా తన మనసుకి ధర్మమని తోచిన కర్మని ఆచరించి, మానవుడు వ్యక్తిగా తన స్వాతంత్ర్యాన్నీ ఉనికినీ నిలబెట్టు కోవాలని కృష్ణరావుగారి సందేశం.

ఈ సందేశాన్ని ''కీలు బొమ్మలు'' నవల మనకి ధ్వన్యాత్మకంగా స్ఫురింప చేస్తుంది. స్వాతంత్ర్యం అంటే ఏమిటి? మానవుడు అస్వతంత్రుడు ఎందుకవుతున్నాడు? ఏ శక్తులు అతన్ని శాసిస్తున్నాయి? వ్యక్తుల కర్తవ్యం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు వెతకటమే ''కీలు బొమ్మలు'' నవల లక్ష్యం. ఇందులో పాత్రలు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకి క్రమక్రమంగా కీలుబొమ్మలై ప్రవర్తిస్తాయి. అంతఃకరణ బోధల్ని పెడచెవిని పెట్టి, తమ ప్రవర్తనని సమర్థించే బలమైన హేతువుల్ని వెతుక్కుంటాయి. అంతఃకరణని తెలిసీ తెలియకుండా వంచించి అసత్యాన్ని సత్యంగా భ్రమించే స్థితికి వస్తాయి. ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని చెయ్యి జారనీయకుండా నివారించగలిగే స్థితిలో ఉండి కూడా, తమ వ్యక్తిత్వాన్ని దృఢంగా నిలబెట్టుకునే స్థైర్యం లేక పరిస్థితులకి క్రమంగా కీలుబొమ్మలై పోతాయి. ఈ పరిస్థితి చేజేతులా తెచ్చుకొన్నదే. మానవుడు స్వతంత్రుడు, అతను స్వాతంత్ర్యాన్ని కోల్పోతే అది ట్రాజెడీ; ఆ స్థితికి తానే కారణం అనే కళాత్మక హెచ్చరికే ''కీలు బొమ్మలు'' నవల. అంతేకాని మానవుడు పరిస్థితుల కీలు బొమ్మ అని నిరూపించటం కాదు. వ్యక్తి చేతనని తట్టి మేల్కొల్పి మానవుడికి తన కర్తవ్యాన్ని ప్రియంగా జ్ఞాపకం చెయ్యటమే ''కీలు బొమ్మలు'' ధ్యేయం.

ఈ నవల ఇతివృత్తం ఓ గ్రామంలోని మోతుబరి రైతు పుల్లయ్య, యువ పారిశ్రామికవేత్త చంద్రశేఖరం కేంద్రాలుగా ఆ గ్రామంలో కొందరి వ్యక్తుల చుట్టూ తిరుగుతూ వాళ్ళని వాళ్ళ వ్యక్తిధర్మాన్ని విస్మ

రింప చేసి కీలుబొమ్మలుగా ఆడించి గ్రామంలో సంక్షోభం సృష్టించే ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక శక్తుల విలయ తాండవాన్ని బహిర్గతం చేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో గ్రామంలో కాగితాలు మిల్లు స్థాపించిన చంద్రశేఖరంకి అయిదు వేల రూపాయల ఋణానికి పుల్లయ్య అడ్డుంటాడు. లాభాలు లేక కాగితాల మిల్లు మూలబడి చంద్రశేఖరం చిక్కుల్లో పడతాడు. ఈ స్థితిలో పుల్లయ్య అతనికి అడ్డుండ లేదనే అబద్ధం ప్రచారమవుతుంది. అబద్ధం ఆడాలనే ఉద్దేశం ఏ మాత్రం లేకపోయినా, అతని ఉపేక్షవల్ల పరిస్థితి విషమించి, ఆ అబద్ధాన్ని ఎదుర్కొంటే కలిగే పరిణామాలకి భయపడి, ఏవేవో హేతువులతో తనని సమర్థించుకొంటూ చివరికి చంద్రశేఖర్ మీద ఫోర్జరీ కేసు బనాయించే స్థితికి పుల్లయ్య దిగజారిపోతాడు. ఇది గ్రామంలో కక్షలకి ఆజ్యం పోస్తుంది. ఇళ్ళూ వాములూ పరశురామ ప్రీతి అవుతాయి. కక్షలకి, కసికి కీలుబొమ్మలైన మోతుబరి ఆసామి మల్లయ్య, హరిజనాశ్రమ సంస్థాపకురాలు అమ్మాయమ్మల జోక్యంతో ఉళ్ళో మలబార్ స్పెషల్ పోలీసు దళం దిగి ప్రజల ధన మాన ప్రాణాలకి హాని వాటిల్లి గ్రామం సంక్షోభానికి గురి అవుతుంది. పుల్లయ్య భార్య లక్ష్మమ్మ, పట్నంలో చదువుకొంటున్న అతని కుమార్తె సీత, పట్నంలో ఏ మూలో తత్వశాస్త్రం చదువుతూ సత్యాన్వేషణలో నిమగ్నుడైన సదుద్దేశాలుగల అతని కుమారుడు గామారావు, పుల్లయ్య బీద గుమాస్తా సత్యనారాయణ, ఆదర్శభావాలున్న డాక్టర్ వాసుదేవ శాస్త్రి ఏదో దశలో స్పష్టాస్పష్టంగానైనా నిజం తెలుస్తున్నప్పటికీ తర్కావితర్కాలతో భ్రమలు సృష్టించుకొని అచేతనలో రక్షణ వలయాలు ఏర్పరచుకొని కర్తవ్య విముఖులవుతారు. చంద్రశేఖరం పుల్లయ్య దౌష్ట్యంలో తన బలహీనతల్ని కప్పిపుచ్చుకొంటూ పతనానికి చేరువౌతాడే కాని పరిస్థితులకి ధైర్యంగా ఎదురొడ్డి నిలబడలేక పోతాడు. ఆదర్శవంతుడైన డాక్టర్ కూడా. విధివశాత్తూ జరిగిన సంఘటన నెపంగా గ్రామం విడిచి పరిస్థితుల్నించి పరారీ చిత్తగిస్తాడు. చివరికి చంద్రశేఖరంకి జైలుశిక్ష పడుతుంది. పుల్లయ్యకి సన్మానం జరుగుతుంది. అధర్మం జయిస్తుంది. పుల్లయ్య గుమస్తా ఉన్మాదియై రాత్రి లైబ్రరీ అరుగుమీద చేరి ''యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి'' ''శ్లోకం పఠిస్తుండడంతో నవల ముగుస్తుంది.

ఈ శ్లోకంతో నవల ముగించటంలో అర్థం ఎవరో ఎప్పుడో అవతరించి ఉద్ధరిస్తారనికాదు. వ్యక్తి చేతనతో మానవుడు తన సామర్థ్యాన్ని గుర్తించి, అంతఃకరణానుసారంగా కర్తవ్యోన్ముఖుడై, తన ధర్మాన్ని నెరవేర్చి, తన జీవితాన్ని శ్రేయోదాయకంగా తానే నిర్మించుకోవాలని ధ్వని; కృష్ణరావు గారికి మానవుడిపట్ల ఆ విశ్వాసం ఉంది.

''పాపి కొండలు'' నవలలోని కొన్ని ప్రధాన పాత్రలు మనకి ఆవిశ్వాసం కలిగిస్తాయి. సుడి గుండాలతో నిండిన గోదావరిలో పాపికొండల మధ్యనించి ప్రయాణించాలంటే ఎంతో మెలకువ, నేర్పు, స్థైర్యం కావాలి. లేకపోతే నౌక తునాతునకలవుతుంది. జీవితంలో అధికారమూ అంతే. ఏమరితే రాజకీయ సుడిగుండాలు మానవుడిని భ్రష్టుణ్ణి చేస్తాయి. ఇదే ''పాపి

కొండలు'' నవల సందేశం. ''స్వతంత్ర భావోన్మేషం, హేతుబద్ధమ ఆలోచన - ఇవే ఈ నవలకు లక్ష్యాలు'' అధికారం ఎందుకో నిర్ణయించుకొని, అధికార సంపాదనలో రాజకీయ సుడిగుండాలు రేపి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ధర్మారావు అనే యువకుడు వ్యక్తి చేతననీ, స్వాతంత్ర్యాన్నీ, హేతువునీ క్రమంగా కోల్పోయి, విలువలకి తిలోదకాలిచ్చి భ్రష్టుడయే వైనమే ఈ నవల ఇతివృత్తం. రాజకీయ నాయకులు స్వార్థంతో మానవ జీవన స్రవంతిలో ఎలా సుడిగుండాలు రేపి, తమ జీవితాన్ని, ఇతరుల జీవితాల్ని ఎంత భయంకరంగా మార్చివేస్తున్నారో ఈ నవల కళ్ళకి కట్టినట్టు చిత్రిస్తుంది. అయితే ధర్మారావు పాత్రకి ప్రతిగా కొన్ని పాత్రల ధృవతారలై ప్రకాశిస్తూ మానవుడి విజయానికి సంకేతాలుగా నిలిచిపోతాయి. ఎటువంటి విపరీత విపత్కర పరిస్థితుల్లోనూ తాను నమ్మిన విలువల్ని త్యజించక అచంచలంగానిలిచిన మహాపండితుడు, వైదిక ధర్మానుష్ఠాత అయ్యన్న శాస్త్రి, కర్తవ్య పాలనం చెయ్యటమే ధర్మమని భావించే సంయమీంద్రుని వంటి మాష్టారు గురుమూర్తి, నిర్లిప్తుడు, వీతరాగి, వివేచనాశీలి హెడ్ మాస్టర్ మాధవరావు, భాష్యాంత వైయాకరణుడు, ఆయుర్వేద వైద్యుడు, తన వృత్తిని డబ్బుకోసం కించపరచని స్వతంత్రుడు బసవయ్య, సాహితీ ప్రియుడు, న్యాయం ధర్మం తప్పినడవటమంటే జాగుప్స చూపే అతని కుమారుడు ఇంగ్లీషు డాక్టర్ ప్రసాద్, నిర్మల స్ఫటిక మణి శారద మానవుడి స్వతంత్ర ప్రతిపత్తికి నీరాజనాలిస్తూ, విలువలకి పట్టం కట్టి మానవుడి భవిష్యత్తులో నమ్మకం కలిగిస్తారు. ''పాపి కొండలు'' అసంపూర్తి నవల కావటం దురదృష్టం.

''బొమ్మ ఏడ్చింది'' నాటకం మతానికీ, విలువలకీ సంబంధించిన దార్శనిక విషయాన్నీ, నీతితో మతానికీ, ప్రభుత్వంతో మతానికీ గల సంబంధాల్నీ వెలుగులోకి తెస్తుంది. ఆర్య నాగార్జునులు బౌద్ధుడు. రాజైన గౌతమీపుత్ర శాతకర్ణి వైదిక మత పక్షపాతి. ఈయన ఏలుబడిలో శ్రీ పర్వతం మీద బౌద్ధారామాన్ని నెలకొల్పి విద్యా బోధన, వైద్య చికిత్స చేస్తుంటారు నాగార్జునులు. మత దురభిమానంతో పరమత అసహనంతో శాతకర్ణి బౌద్ధ భిక్షువులను బాధిస్తుంటాడు. ఈ సందర్భంలో ఆర్య నాగార్జునులు కులాతీతంగా, మహాకరుణ ప్రతిపాదకంగా, ధర్మ బోధకంగా, హితోపదేశంగా శాతకర్ణికి ''సుహృల్లేఖ'' రాస్తారు. వ్యక్తులు విచక్షణ లేకుండా అందరిపట్ల కరుణ చూపించటమే ''మహాకరుణ'' తాత్పర్యం. కాని రాజు ఆగ్రహిస్తాడు. ఆర్య నాగార్జునులు ''ప్లాటినస్'' అనే విదేశీయుడికి మానవతతో చికిత్స చేయటం రాజుకి దేశద్రోహంగా కనిపిస్తుంది. బౌద్ధ భిక్షువుల్ని రాజ స్కంధావారాన్ని అనుసరించమని శాతకర్ణి ఆజ్ఞాపిస్తాడు. ''నిజమైన మతం ధ్యాన ప్రజ్ఞా సమ్మితం. ఈ మతంలో ఆత్మ శాసనం తక్క బాహ్య శాసనం చెల్లరాదు'' అని నాగార్జునులు తిరస్కరిస్తారు. వారికి రాజు దేశ బహిష్కరణ శిక్ష విధిస్తాడు. విదేశీయుడైన ప్లాటినస్‌కి మరణదండన విధిస్తాడు. మత ప్రమేయం కాకూడని రాజ్యం మత ప్రమేయమై, మానవ ప్రవర్తనలో ధర్మం, న్యాయం లోపించి అధర్మం పరాకాష్ఠ చెందిన ఈ సంఘటనకి ''బొమ్మ

ఏడ్చింది''. బౌద్ధుల షట్పారమితులైన శాంతి, దాన, వీర, క్షాంతి, ధ్యాన, ప్రజ్ఞల ప్రతీక అయిన షట్పారమితాదేవే ఆ బొమ్మ. దీన్ని ఆర్య నాగార్జునులు బౌద్ధ మతానుయాయి అయిన రాజమాత గౌతమీ బాలశ్రీకి బహూకరిస్తారు. ''అది అలా ఏడుస్తూనే ఉంటుంది. ఆ బొమ్మ మానవుల మనస్సులలో మెదలిన నాడే లోక కళ్యాణం'' అంటూ ఆర్య నాగార్జునులు నిష్క్రమిస్తారు. వ్యక్తి భావనకీ, వ్యక్తి చేతనకీ, మానవ స్వాతంత్ర్యానికీ ఆర్య నాగార్జునులు మేరుశిఖరం.

ఇక ''ఆదర్శ శిఖరాలు'' నాటికల సంపుటి మానవుడు చైతన్యవంతుడై జీవితానికి అర్థం వెతుక్కుంటూ, ఆదర్శ శిఖరాన్ని అదిరోహిస్తూ సంతరించుకొన్న అనుభవాల సంపుటి. ఇందులోని నాటికలన్నీ జీవితపు విలువల్ని ఒక క్రమంలో ఆవిష్కరిస్తాయి. విలువలకి ఒక ఆధిక్యతా క్రమం ఏర్పరచవచ్చు. సత్యం, శివం, సుందరం, మతం, దైవం వంటి తాత్త్విక భావాలకి సంబంధించిన విలువలది పై స్థానమయితే, ఆర్థికాది భౌతిక విలువలది కింది స్థానం. నైతిక, జ్ఞాన, సామాజిక, రాజకీయాది వ్యవస్థలకి సంబంధించిన విలువలది మధ్య స్థానం. అయితే ఏ ''విలువ విలువ దానికుంది. విలువలన్నీ ఆవశ్యకాలే. ఇది కేవలం ఆవశ్యకతల ఆదర్శాల క్రమం అనుకోవచ్చు. ఈ విలువలన్నీ అనుభూతి పొందినప్పుడే వ్యక్తి జీవితం సమగ్ర మవుతుంది. చరితార్థమవుతుంది. ''ఆదర్శ శిఖరాలు'' సంపుటిలోని నాటికల్ని ఈ క్రమంలో- అంటే ఆర్థిక విలువ ప్రాతిపదిక అయిన ''భిక్షాపాత్ర'' నాటికతో ప్రారంభించి, సత్యం శివం సుందరం వంటి అంతిమ విలువల్ని ఆవిష్కరించే ''ఆదర్శ శిఖరాలు'' నాటికతో ముగిస్తూ సంపుటీకరించి, కృష్ణరావుగారు ప్రతి మానవుడు వ్యక్తి చేతనతో స్పందించి విలువల సమగ్రతని అనుభూతి పొంది, పూర్ణమూర్తిమంత్వ వికసింప చేసుకోవాలని ధ్వన్యాత్మకంగా సూచించారు.

ఏ వ్యక్తీ మరో వ్యక్తి కాడు. మరో వ్యక్తిలా ఉండడు. మరో వ్యక్తిలాగే ఆలోచించడు. మరో వ్యక్తిలాగే మాట్లాడ డు. మరో వ్యక్తిలాగే ప్రవర్తించడు. మరో వ్యక్తిలాగే జీవించడు. ఇది సహజం. అందువల్ల మనిషి సహజంగా స్వతంత్రుడు. తన అంతఃకరణననుసరించటమే స్వాతంత్ర్యం. ఆ విధంగా ప్రవర్తించడమే కర్తవ్యం. ఈ భావంతో స్పందించటమే వ్యక్తి చైతన్యం. సీసానునసరించి ఆకృతి మారే ద్రవంలా కాక, ప్రతికూల శక్తులకి తలఒగ్గకుండా పోరాటం జరపటమే వ్యక్తిత్వం. ఈ వ్యక్తిత్వమే మానవుడి సర్వతోముఖ వికాసానికి నేపథ్యం. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యాన్నీ, దర్శనాన్నీ మథించి, జీవితానుభవాల్ని కాచి వడపోసి, తాను దర్శించి, ప్రతిభావ్యుత్పత్తులతో డాక్టర్ జి.వి. కృష్ణరావుగారు రసవంతంగా తాము రచించిన ప్రధాన రచనల్లో ఆవిష్కరించిన సత్యం ఇదే. ★

యీ వ్యాస రచనకు ''సాహితీ చైత్రరథం'' లోని వివిధ రచనలు తోడ్పడ్డాయి.

# బొందితో స్వర్గం

— అన్వేషి

''యాత్ర'' కాలం నాటికి కొంచెం ముందే, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కొందరికి ఎల్ఎస్‌డి అనుభవైక వేద్యం అయింది - కొందరికి పరలోక నివాసాను భవం కలిగిందట - మరి కొందరికి జీవిత పథాన్నే మార్చేటంత గొప్పగా అనుభవాలు కలిగినాయి - అందరికీ ఏదో జ్ఞాన జ్యోతి కానవచ్చినంత పని అయింది. జాన్ హెర్సే వ్రాసిన ''నడవడానికి అలవికాని దూరం'' (టూఫార్ టు వాక్) అనే నవలలో దయ్యానికి కలిగిన అనుభవం ఇదే - ఎల్ఎస్‌డి వలన దయ్యం అనంతంలోకి వెళ్లిపోయింది! - అంత సుదూర యాత్రను అవలీలగా చేయగలిగింది! సానుకూలంకాని యాత్రలు కూడా కొందరి అనుభవంలో చేరుకున్నా యనుకోండి - కొందరి యాత్ర సమీపాన్ని చేరుకొనడంతోనే ముగిసింది-అంటే సమీప వైద్యశాలలోని మానసిక అస్వాస్థ్య విభాగంలోనే అంతం! దుర్యాత్ర! పీడకల లాంటి అనుభవం కొందరికి - మరికొందరి యాత్రానుభవం, పోవడమే కానీ, తిరిగి రావడం అనేదే లేదు. ఎల్ఎస్‌డిని గురించిన అనుభవ వాహినులు వందలై పారినప్పటికీ, దాని గొప్పను గురించి తాపీగా, నిర్మమతతో మదింపు చేసుకొనే అవకాశమూ కలుగుతున్నది. దానిని ఆత్మీయంగా సేవించే వారు ఎంతగా అది సద్యో నిర్వాహణ సుఖాన్ని చేకూర్చుతుందని చెప్తున్నా, అది నిజంగా అటువంటి ఉత్కృష్ట పదార్థం కాదు. సుఖదాయీ కాదు. అమెరికా వారు విస్కీ సేవన యుగం నుంచి అతి మాదక యుగంలోకి

మీ విద్యా క్షేత్రంలో యాత్రల దళారి -ఒక్క యాత్ర వెయ్యి మాటలకు సమం'' అని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయ ఆవరణలో ఒక చోట ఒక నినాదప్రాయమైన ప్రకటన కానవచ్చింది. యాత్ర ఏర్పాట్లు ఎవరు చేస్తారు? మూడు చెక్క దిమ్మలపైన మూడు అక్షరాలలో దళారి పేరు పొడి అక్షరాలతో ఉంది. ఎల్.ఎస్.డి! విశ్వవిద్యాలయంలోని అందరూ ఈ యాత్ర ఏమో, ఈ మూడు మంత్రాక్షరాల అర్థమేమో పాతిక ముప్పది ఏళ్ల కిందటనే ఎరుగుదురు. ''యాత్ర'' అంటే అంతరాత్మలోనికి గానీ, అంతరాత్మ నుంచి బయటకు గానీ ప్రస్థానం- ఎల్.ఎస్.డి. సమకూర్చే యాత్ర.

యాభై ఏళ్ల కిందట! అమెరికాలో గొప్ప నరాల వైద్య నిపుణుడుగా పేర్గాంచిన వీర్ మిచెల్ ఒక మొక్క (పెయోట్ కాక్టస్) గింజలు తిని, పాలపుంతలోని నక్షత్రాలు గ్రహాలు అన్నీ కలసి ఒక కాంతివాహిని లాగా పోవడం చూడగలిగినా నన్నాడు. ఈ గింజలు అందరికీ లభిస్తే, వీటివలన విస్తరించే వ్యసనం ప్రమాదకారి అవుతుందని అతడు ఆనాడే జోస్యం చెప్పాడు. ప్రస్తుతం ఆ ప్రమాదం రానే వచ్చింది - అదే ప్రభుతను నిర్వహిస్తోంది! అయితే అవేవో గింజలు తినినందువలన కాదు - - వీటి కంటే అనేక రెట్లు ప్రమాదకారి అయిన నేటి మందు ''లైసర్జిక్ యాసిడ్ డైతిలామైడ్ '' (ఎల్ఎస్‌డి) జనాలపై అధికారం నెరపుతున్నందు వలన.

పోతున్నారు అని ఒకరి వర్ణన. అదే - ఎల్ఎస్డి ఒక అంధ విశ్వాస ప్రాయమైనది - సామాన్య విశ్వాస తుల్యమైనది మాత్రం కాదు.

ఆహార ఔషధ శాఖవారి లెక్కల ప్రకారం వేలాది కళాశాల విద్యార్థులు దీనికి జోగులవుతున్నారు. వేలాది మంది దీనిని రుచి చూశారు. ఒక రోజు లాస్ ఏంజెలిస్ నగర ఆసుపత్రులలో 2000 మంది రోగులు వీళ్లేనని తేలింది. (ఇది పాతికేళ్ల కిందటి ముచ్చట.) అదే కాలంలో న్యూయార్క్ నగరంలో ఈ అతిమాదక ద్రవ్యాన్ని సేవించే వారి సంఖ్య ఒక్క ఏడాదిలో ఐదువేల నుంచి పదివేలయిందని పేర్కొన్నాడు. అక్కడి విశ్వవిద్యాలయానికి చెందిన వైద్య శాస్త్రాచార్యుడు డాక్టర్ విలియం ఫ్రాన్క్. సినిమాలలో నాటకాలలో నటించే వారిలో అరవై శాతం మంది యీ మందుభాయీలే అని సినిమాల, నాటకాల కంపెనీల వాళ్లే ఒప్పుకుంటున్నారు. లాస్ ఏంజెలిస్‌లో ఒక నాట్య సంఘం ఉంది. దానిపేరు ''యాత్ర''-వాళ్ల ముఖ్య ప్రదర్శనల్లో ఒకటి ''పోదాం-అట్లా, అట్లా!'' (లైసర్జిక్ ఏ గోగో) - పాదాలను పట్టి పైకి పంపే పాదపీఠాలు, బొందితో హాయిగా విహరించి రావడానికి ప్రాసాదాలు - ఎన్నో ఎన్నో. ఏమైనా ఈ అతి మాదక సేవనం పేదల గుడిసెలలోకి ప్రవేశించలేదు? పేదలకు ఇంత డొంక తిరుగుడు నిర్వాణం అక్కర్లేదు; వాళ్లు అంతరాత్మలలోకి యాత్రలు చేయరు; స్వప్నలోకాలలోకి యాత్రలు చేయరు - వాళ్లు ఉన్న స్థితిలోంచి నేరుగా పారిపోతారు. ఎల్ఎస్డి అప్పటికి మధ్యతరగతి కంటే కిందికి దిగిపోలేదు.

అమెరికా ప్రజా ప్రతినిధుల సభ ఉపసంఘం వారు, ఈ సమస్యను గురించి క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఎల్ఎస్డిని కలిగిఉండడం నేరమని ఒక శాసనం చేయాలనుకున్నారు కానీ, చేయలేదు. కాలిఫోర్నియా, నెవాడా రాష్ట్రాలలో అటువంటి శాసనం ఉన్నది. దేశం మొత్తానికి వర్తించే అటువంటి శాసనం చేయడానికి అమెరికా సంయుక్త రాష్ట్ర సమాఖ్య అధికారులు సుముఖులుగా లేరు. అట్లాంటి శాసనం చేస్తే, పరిశోధనలో గూడా నిషిద్ధం అవుతుంది ఎల్ఎస్డి. (ప్రస్తుతం దాదాపు నిషిద్ధం ద్రవ్యమే అయింది). మాదక ద్రవ్యాలకు సంబంధించిన శాసనాలనే పటిష్ఠం చేస్తే సరిపోతుందన్నారు అధికారులు - అంటే, అనుమతి లేకుండా ఎల్ఎస్డిని (ముఖ్యంగా లైసర్జిక్ ద్రావకాన్ని) ఉత్పత్తి చేయరాదు. రవాణా చేయరాదు, అమ్మరాదు వగైరాలు, నిషేధావళిలో చేర్చితే చాలునన్నారు.

లైసర్జిక్ ద్రావకం తయారీ కష్ట సాధనమైనదే. ధాన్య శిలీంధ్రం నుంచి తీసే ఒక పదార్థం ఎర్గాట్ - దానిలోంచి తీస్తారు ఈ ద్రవకాన్ని ఈ ద్రావకాన్ని కెనడా, మెక్సికో, యూరప్‌ల నుంచి అమెరికా సంయుక్త రాష్ట్రాలలోకి అక్రమ రవాణా చేస్తున్నారు. ద్రావకం లభిస్తే ఎల్ఎస్డి ఉత్పత్తి సుగమం - ఏ కొంచెం రసాయనిక శాస్త్రం పరిచయమున్నా, ఉత్పత్తి చేయవచ్చు. మొత్తానికి ఆ ద్రావకాన్ని వేరే ఏదో రసాయనంలో కలిపివేస్తారు. వల్కనైజింగ్‌లో ఉపయోగించే డైతిలామైడ్ ను దీనితో కలిపి, బాగా కలయ గలిపి, ఘనీభవించే శీతల స్థితికి చేర్చి, ఒక మిశ్రమం రూపొందిస్తారు.

దానిలోంచి ఎల్ఎస్‌డిని వేరు చేయాలి. క్లోరోఫారం, బెంజీన్ ప్రయోగించి, వాక్యూం ఎవాపరేటర్ ద్వారా గానీ, ఆవిరి ప్రక్రియ ద్వారా గానీ, క్రోమటోగ్రాఫిక్ కాలం అనే ఉపకరణం సహాయంతో వేరు చేయవచ్చు. రసాయనిక శాస్త్ర ఉపకరణాల దుకాణాలలో దొరికే ఉపకరణమే ఇది.

ఎల్ఎస్‌డి సర్వసాధారణంగా చీకటి బజారులోనే దొరుకుతుంది. చక్కెర క్యూబులలో గుప్తం చేస్తారు. నూరు మైక్రో గ్రాముల ఎల్ఎస్‌డిని ఒక క్యూబులో గుప్తం చేస్తారు. - ఒక్కొక్క క్యూబు వెల రెండు న్నర డాలర్లనుంచి ఐదు డాలర్ల వరకూ ఉండవచ్చు. దీనివలన ఎనిమిది నుంచి పది గంటల వరకూ యాత్రలో మునగానాం తేలానాం చేయవచ్చు! మరొక పద్ధతి - ఎల్ ఎస్‌డిని నీళ్లలో కలిపివేయాలి - ఆ నీటిలో గుడ్డను తడిపి, ఆరబెట్టి, ఆ గుడ్డను చిన్న చిన్న చదరపు ముక్కలు చేయాలి. గుడ్డము క్కను చప్పరించి, నమిలిన వారికి యాత్రా సుఖం లభ్యం! ఎల్ఎస్‌డిని కనిపెట్టడం కష్ట సాధ్యం - అది రంగు, రుచి, వాసనలేని పదార్థం. ఒక్క గ్రాము ఎల్ఎస్‌డితో పది వేల యాత్రలు చేయవచ్చు! దానిని క్షేమంగా, మరెవ్వరికంటా పడకుండా ఒక్క సిగరెట్‌లో దాచి వేయవచ్చు. మొదట్లో ఎల్ఎస్‌డి ఉత్పత్తిదారులు ఔత్సాహికులు; కానీ బాగా లాభాలు తెచ్చే వ్యాపారం కదా! ఆ పైన ప్రబలులైన వ్యాపా రులు చేరారు - గూండాల వ్యవస్థలకే సాధ్య మైన వ్యాపారం. గట్టి శాసనాల వలన దీనిని అరికట్టవచ్చు ననుకున్నారు. గట్టిశాసనాల వలన, గూండాగిరీ పెరిగి, ఎల్ఎస్‌డి లబ్ధి కష్టసాధ్యమై, దాని ఖరీదు పెరిగి పోయింది.

శారీరక ఆవేదనలు, మానసిక వేదనలు ఉపశమించడానికి ఔషధాల కోసం మాన వుడు చిరకాలంగా అన్వేషిస్తూనే ఉన్నాడు. అనిత్యమైన ఈ దేహాన్ని, దివ్యత్వపు సన్నిధిలోకి చేర్చడం కోసం పడేతపన అన్ని అన్వేషణల కంటే ఉత్తమం అని కూడా మనిషి భావించు తూనే వున్నాడు. సోమపానం అటువంటి సన్నిధిని సాధ్యం చేస్తుందని సంస్కృత గ్రంథాలు చెప్తున్నాయి. కామ్‌చత్కా ద్వీక ల్పంలోని సంచార జాతులలో, ''అమా నితా ముస్కారియా'' అనే పుట్టగొడు గును తగు విధంగా సేవిస్తే, దేవతలుండే జ్యోతిర్లోకంలోకి వెళ్ళి రావచ్చునని ఒక గాఢ విశ్వాసం ఉంది. దానిని సేవించిన వారి మూత్రాన్ని సేవించిన వారు కూడా జ్యోతిర్లోకానికి చేరుకోవచ్చు నన్నారు - అయితే ఆ మూత్రాన్ని తడవకు ఐదుగురికంటే ఎక్కువ త్రాగరాదు. కొలంబస్ వెళ్లడానికి చాలా పూర్వం, దక్షిణ అమెరికాలోని కొలంబియాలో భూతవైద్యులు ''కొహూబా'' నశ్యం నాసాపుటాలకు ఎక్కించితే చాలు దేవతల తోనూ, మృతుల తోనూ హాయిగా సంభాషించ వచ్చునని చెప్పేవారు.

మనసును మార్చే మందులను మూడు విధాలుగా చెప్పుకోవచ్చు. తేలిక పాటివి, అంటే కనీసమైన మార్పును కలిగించేవి (మార్నింగ్ గ్లోరీ గింజలు, నట్మెగ్, మారిజువానా), మధ్య రకంవి - అంటే పీర్ మిచెవ్ సూచించిన బాపతు, మెక్సికో వాళ్లు చెప్పిన ఒక పుట్టగొడుగు (దీని లోంచి వెలువడే సిలోసిబిన్ అనే పదార్థమే మత్తు నిచ్చేది), అమానితా ముస్కారియా

(దీనిలోంచి వెళ్ళే మత్తు పదార్థం బుఫోటె నైన్), కోహ్బామా (దీని నుంచి డైమెతిల్ ట్రిప్టోమైన్ తీయవచ్చు); ఈ రెండూ పోగా, మూడవది ఎల్ఎస్డి - తీవ్రమైనది; మెక్సికో పుట్టగొడుగులోని సిలోసిబిన్ కంటే వంద రెట్లు తీవ్రమైనది; వీర్మి చెవ్ సూచించిన మెస్కలైన్ కంటే ఏడువేల రెట్లు తీవ్రమైనది మారిజువానాను ఎంతగానో మించినది.

ఎల్ఎస్డికి గల వైద్యమూల్యం ఇంకా పూర్తిగా స్పష్టం కాలేదు. రేడియో ధార్మికత కలిగిన ఎల్ఎస్డిని ఒకరికి ఇంజెక్షన్‌గా ఇచ్చారనుకోండి-దానిలో కంటికి కానరానంత చిన్న మోతాదు మాత్రమే బుర్రలోకి ఎక్కుతుంది- దాని మత్తు మదం పైకి ఉబికే సమయానికి ఆ కాస్త మోతాదు ఉనికి గూడా లేకుండా పోతుంది. అందువలన అంటారు గదా, ఎల్ఎన్డి ప్రత్యక్షంగా ఏమీ చేయదు అనీ, దాని ప్రేరణ వలన అనేక మానసిక శారీరక, చేష్టలు ఉత్పన్నం అవుతవనీ. ఈ మార్పుల ప్రభావం బుర్ర కేంద్రం పైన పడ్తాయి. అంటే లోపల జరిగే ఆలోచనలకూ, బయట జరిగే చేష్టలకూ ఆధారమైన కేంద్రం పైన పడ్తాయి- అంటే పరస్పర ఆధారంతో పనిచేసే నరాలకూ, ఆధారపడకుండానే చేతనం పొందే నరాల వ్యవస్థకు ఆధార భూతమైన కేంద్రంపైన పడ్తాయి. ఎల్ఎన్డి తీవ్రతను ట్రాంక్విలైజర్లు, బార్బి ట్యురేట్లు కొంత అరికట్టాయి. కానీ ఆం ఫీటమైన్ లాంటి స్టిమ్యులెంట్లు తీవ్రతను ఎక్కువ చేస్తాయి. ఎల్ఎస్డి వలన శరీర సౌష్టము పెరగదు. అది శారీరకంగా ఏ తప్పనిసరి అలవాటుగానూ పరిణమించదు-కానీ మానసికంగా మాత్రం అలవాటు అవుతుంది!

స్విట్జర్లాండ్ లో శాండోజ్ లెబొరెటరీలలో పరిశోధకుడుగా పనిచేస్తున్న డాక్టరు ఆల్బర్ట్ హోఫ్మన్ 1938లో ఎల్ఎస్డిని రూపొందించాడు. నరాలను ఉత్తేజ పరచే మందు కనిపెట్టడానికి చేసే ప్రయత్నంలో దీనిని రూపొందించాడు. చేసిందేదో చేశాడు. దాని తీవ్రతను అతడు అప్పట్లో గ్రహించలేదు. ఐదేళ్ళ తర్వాత ఒకనాడు ఎందుకో దానిని బాగా వాసన చూశాడు -గట్టిగా ఎగబీల్చాడన్నమాట. అంతే అతడి బుర్ర తిరిగింది-సంధి ప్రేలాపనకు దిగాడు-ఏమేమో దృశ్యాలు స్పష్టంగా సాక్షాత్కరించ నారంభించాయి- పంచరంగుల మేళవింపులతో!

సరిగా మానసిక అస్వాస్థ్యాలకు సరితూగే మందు ఎల్ఎన్డి అని ఒక సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది. పిచ్చిని కుదర్చడానికి ఒక రసాయనిక ఔషధం కావాలి-అది ఇదే నన్నారు. మానసిక వ్యాధుల వైద్యుడు దీనిని సేవిస్తే, ఉన్మత్తుని మానసిక స్థితిని అవగతం చేసుకోగలుగుతాడన్నాడు. నిజంగా, ఎల్ఎన్డి సేవనం వలన కొన్ని మానసిక వైపరీత్యాలు ఉత్పన్నం అవుతాయి- ఎల్ఎన్డి సేవిస్తే, తన దేహంనుంచి బయటపడినాననే భావన వచ్చి పడ్తుంది (పరకాయ ప్రవేశము). తను విడిపడినట్లు, విదేహుడైనట్లు భావన అనుభవమవుతుంది. ఒక్కటే పేచీ -పిచ్చివాడు తన మానసిక స్థితి తనదే ననుకుంటాడు- ఎల్ఎన్డి సేవించిన వాడు, తన మానసిక స్థితికి ఎల్ఎన్డి కారణం అనుకుంటాడు.

మానసిక అస్వాస్థ్యాల పరిశోధకుల ఆలోచనలు ఇట్లా ఉంటే, ఎల్ఎస్‌డి వలన ఆధ్యాత్మికంగా ప్రభావితులయ్యే సాధ్యాసాధ్యాల పట్ల ఆసక్తి కొందరికి కలిగింది. అలన్ వాట్ అనే బ్రిటిష్ జాతీయుడు, ప్రాచ్య తత్వాలు ఎరిగిన వాడుగా పేరు పొందాడు-అతడు ఆరేళ్లు మత గురువుగా కూడా వ్యవహరించాడు. అతడి అనుభవా మృతం ఈ విధంగా ఉంది. ''ఎల్ఎస్‌డి అనేది స్పష్టంగా ఒక కొత్త మతమే. దేవుణ్ణి చంపి పుట్టినదను కోండి. ఇతర ఔషధ సాధనాలన్నీ వమ్ము అయి పోయినాయి. ఎల్ఎస్‌డి నిజంగా ఆధునిక సాంకేతిక ఆధ్యాత్మికత''

ఈ విధమైన గుప్తతత్వం ఆల్డూ హక్స్‌లీ మొట్టమొదటగా ప్రచారం చేయ నారంభించాడు- ఆయన 1954లో వ్రాసిన చైతన్య ద్వారాలు (దోర్స్ ఆఫ్ పర్సెప్షన్) అనే పుస్తకంలో మాదక ద్రవ్య సేవనం వలన కలిగిన అనుభూతి వర్ణనలున్నాయి. లోగడ సాధకులు ఉపవాసాలనూ, ఆత్మ హింసనూ మార్గాలుగా పెట్టుకునే వారు-ఇప్పుడటువంటివి అనవసరం-ఆధ్యాత్మిక అనుభూతి కోసం తోడ్పడే రసాయనిక పద్ధతులు ఉన్నాయి. తపస్సుతో, నిర్వా ణంతో సమానమని వ్రాశాడు.

ఉపోష్యాలు, ఆత్మహింసలు, ఇంద్రి యక్షయము, మంత్రోచ్చాటనం, వగైరా లన్నీ సమాధిస్థితిని, ఆనందాన్ని, దివ్యదృ శ్యాలను కల్పించగల మానసిక పరివర్తనా లను చేకూర్చవచ్చును- అది దైహిక పరివర్తనం కావచ్చు, రసాయనిక పరివ ర్తనం కావచ్చును. ఆధ్యాత్మిక సాధనాలలో చాలా బాధాకరమైన మార్గాలు అనుసరించే వారు- ఎందువలన?- తగు ఔషధాలు లభించనందువలననే. కానీ సాంప్రదాయిక మతానుయాయికి ఇట్లు రసాయనాల ద్వారా, సాంకేతిక పద్ధతుల ద్వారా సాధన చేయడం దోషం. ఒక మనిషి కొండశిఖరా నికి ఒక వాహనం ద్వారా ఎక్కవచ్చును-నడిచిపోయే వాడు చూసే దృశ్యాలే చూస్తాడు; కానీ ఆరోహణ ప్రక్రియలో అతడు చేసిన కృషి ఏమీ ఉండదు కదా-దృశ్యాలే ప్రధానం కాదు-సాధన ముఖ్యం. దృశ్యాలు అందాలు వగైరాలు ప్రధానం కాదు- సాధన ముఖ్యం-దృశ్యాలు అందాలు వగైరాలు ప్రధానం కావు అంటారు. ధ్యానం ద్వారా, అటువంటి సాధన ద్వారా, దివ్యానుభూతి పొందాలని మత గ్రంథాలు చెప్తున్నాయి-ఏదో ఒక మాత్ర వేసుకుని ఈ అనుభూతి పొందాలి అవి చెప్పడం లేదు గదా. మతంలో ఉత్కృష్టత కోసం ప్రాచ్యతత్వాలపట్ల దృష్టిని సారిస్తూ ఉంటారు- అవి ఏమ న్నాయి? ''ప్రపంచంతో సమాధానపడు-చెట్టు, పుట్ట, కుక్క అన్నిటి పట్లా సమదృష్టితో వ్యవహరించడం తగుతత్వం అవుతుంది.''

అమెరికాలో ఆధ్యాత్మిక గురువుగా, అమరవీరుడుగా చలామణీ అయిన వ్యక్తి టిమొతీ లియరీ-1960లో రసాయన ఔషధాలతో ప్రయోగాలు చేయసాగాడు-అతడు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మానసిక విజ్ఞాన ఆచార్యుడు -వ్యక్తిత్వంపైన పరిశోధన కేంద్రీకరిం చాడు- అతడూ, అతడి సహాయకుడూ చేసే ప్రయోగాలు అదుపు తప్పే సరికి, వాళ్లని ఆ విశ్వవిద్యాలయం వారు బర్తరఫ్

చేశారు. ఆ పైన మెక్సికోలోని అకపుల్కోలో పరిశోధనలు ప్రయోగాలు కొనసాగించాడు. వాళ్ళూ ఇతడిని బర్తరఫ్ చేశారు. 1966 ప్రాంతంలో అతడిని టెక్సాస్ రాష్ట్రంలో ఒక జడ్జి విచారించి, 30 ఏళ్ల ఖైదు, నలభై వేల డాలర్ల జరిమానా విధించాడు- దేనికి? అతడు అర ఔన్సు మారిజువానాను రవాణా చేశాడట, పైగా దానిపైన పన్ను చెల్లించలేదట! - తర్వాత అతడిని జామీనుపై విడుదల చేశాడు. ఆ తర్వాత అతడు అంతర్జాతీయ సంఘం ఒకటి నెలకొల్పాడు- ఎల్ఎస్‌డి, సిలోసిబిన్ వగైరాలను ''చ్యూయింగ్‌గం''ల లాగా ప్రజానీకానికి అందుబాటులో ఉంచాలని అతడి వాదం.

లియరీ తాను హిందువునని చెప్పేవాడు. అతడి వాదం కేవలం ప్రాచ్యతత్వాన్ని ఆధారం చేసుకున్నదే- అమెరికా ప్రఖ్యాత పాశ్చాత్య తత్వవాదులు చెప్పే ''లక్ష్య ప్రధాన'' బాహ్య లక్షణ ప్రధాన వైఖరిని అతడు నిరసించే వాడు. బుద్ధుడు ఒక స్వేచ్ఛా జీవి అని- అంటే డ్రాప్ ఔట్ అని అతడు చెప్పేవాడని అతడి శిష్యుల మాట. పలువురు సాంప్రదాయిక విశ్వాసాల పట్ల తీవ్రత చూపడం అతడికి గిట్టలేదు- ఆ తీవ్రతను పోద్రోలడం ఒక ''క్రీడ'' గా అతడు వర్ణించేవాడు. పోద్రోలడం చాలా కష్టసాధ్యం కదా- చాలా మంది యువకులు అతడి బోధలు విని, ఎల్ఎస్‌డిని సేవించి, చిత్తాన్ని నిలవరించుకోలేక, విద్యాలయాల నుంచి విడిపడి, శీఘ్రగతిన జీవితంతో విడిపడ నారంభించారు- శీఘ్రగతిన తాము ''చూసినాము'' అనీ, ''తెలుసుకున్నాము'' అనీ నమ్మేవారు!

ఎల్ఎస్‌డి రెండు ప్రధాన ఫలితాలు ఇస్తుంది- ఒకటి -ప్రాపంచిక సంబంధ జాలాన్ని మటుమాయం చేస్తుంది, పాత అలవాట్లను పారద్రోలుతుంది.

టెలిఫోన్ ఉంది కదా- ఎల్ఎస్‌డి భోక్తకు అది ఒక నల్ల ప్లాస్టిక్ రూపం, అదేదో మనిషి అనుకుని దానిలోకి కొందరు మాట్లాడ్తూ ఉంటారు. హాస్యాస్పదమైన వ్యవహారమే!

మరొకటి- ఒక వస్తువుకూ ఇంకొక వస్తువుకూ తేడా అనేది ఎల్ఎస్‌డి భోక్తకు కానరాదు- అన్నీ ఒక్కటే! ఒక మనిషి కాళ్ళూ చేతులూ కబంధం అన్నీ ఒకటే-ఒకే ద్రవ రూపంలో ప్రవహిస్తున్నట్లుంటాయి. (ఘోరమే!) - ఒక చోట కూర్చున్న వారందరూ ఒకటిగానే కానవస్తారు, భావాలు అందరివీ ఒకటే అవుతాయి (ఇదే ప్రేమ?) - తర్క భేదాలన్నీ సమసిపోయి, అంతర్ దృష్టిని గంభీరం చేసి, జీవన్మరణాలు ఒకటే (సత్యం)నని నిరూపిస్తాయి!

ఇంకొక ముచ్చట-భావప్రేరణలో ఎల్ఎస్‌డి బలీయమైనదని దీని భక్తుల మాట. ''నేను హాయిగా ఉన్నాను'' అని అనుకో- ఎంతో హాయిగా ఉంటుంది. ''నేను దీనుడను'' అనుకో- బోలెడు దైన్యం ఆవరిస్తుంది- తన పట్ల జాలి కలిగి, ఏడుపు వస్తుంది. ఇట్లాగే అనేక రంగుల దృశ్యాలు కానవస్తాయి. దృష్టి స్పష్టమవుతుందంటారు ఎల్ఎస్‌డి భక్తులు. వాస్తవానికి ఈ మందును సేవించి నందువలన దృష్టిమందగిస్తుంది! ఒక దారుణ మానసిక స్థితిని మరింత దారుణం చేస్తుంది ఎల్ఎస్‌డి.

ఎల్ఎస్‌డి తాత్వికులు చెపుతారు. దాని సేవన కార్యక్రమాన్ని అనుభవజ్ఞుని ఆధ్వర్యంలో తీర్చిదిద్దు కోవాలని. అతడే నాయకుడు. అతడి పాత్ర, ఈ సంఘంలో అతడి ప్రాధాన్యం చాలా ఉత్తేజకరమైన వంటాడు లియరీ. నాయకుడు అంటే విముక్తి కలిగించేవాడు, జ్యోతి ప్రదాత, యావజ్జీవ అస్వతంత్రతను అంతఃకరణ నుంచి తొలగించే హితుడు.

ఈ మాదక, అతి మాదక ద్రవ్యాలతో ప్రయోగ పరిశోధనలు చేసిన మానసిక తత్వ నిపుణులకు మాత్రం, పైన చెప్పిన లియరీ భావజాలం కేవలం ఊకదంపుడు -అమాయకులను వ్యసనంలోకి దింపి వారికి ముప్పు కలిగించే వాగాడంబరం మాత్రమే. ఎల్ఎస్‌డి ప్రభావంలో పడిన వారు తలపెట్టే అవకతవకలు కొన్ని- ఈతరానివాడు ఈదగలననుకుంటాడు. ఎగరలేనివాడు ఎగురుతానంటాడు. ఒక లాస్ ఏంజలిస్ యువకుడు వేగంగా పోయే కారును ఆపగలననుకున్నాడు- కారు ఆగలేదు, యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పత్రికలు అమ్మే వాడొకడు తాను ప్రపంచానికి బోధచేయడానికి యోగ్యుడననుకున్నాడు! కళాశాలకు ఎగగొట్టే యువకుడొకడు చేతిని గాయపరచుకుని ఒక పూల తోటలో కూర్చుని రక్తం కార్చుకుంటూ చనిపోయాడు. ''తగు అదుపు అజమాయిషీ చేయగల శాస్త్రవేత్త సమక్షంలోనే ఎల్ఎస్‌డిని ఉపయోగించాలి. లేకపోతే పసివాళ్లకు ఆట వస్తువులుగా బాంబులు ఇచ్చినట్లు అవుతుంది'' అని సిడ్నీ కోహెన్ అనే మనస్తత్వ విజ్ఞాని హెచ్చరిస్తున్నాడు.

చికాగోలో మర్విన్ జిపోరిన్ అనే మానసిక వైద్యుడు ఉన్నాడు. 1960 తర్వాత 50 మంది రోగులకు ఎల్ఎస్‌డి ఇచ్చాడు. ఇదిగాక తను సేవించాడు, అతడి భార్య, న్యాయవాదిని, సేవించింది. వైద్య పరిభాషలో చెప్పాలంటే, అది చేసే పని, మనిషి వ్యక్తిత్వాన్ని బట్టబయలు చేయడమేనని ఆయన చెప్పాడు.

''మానసిక వ్యాధులలో ఎక్స్‌రే లాంటిది ఎల్ఎస్‌డి. దానివలన ప్రపంచ చిత్రం భిన్నంగా గొప్పగా కనిపిస్తుందనుకొనరాదు. అదివరకు ప్రపంచం ఎట్లా కనపడేదో, అది సేవించిన తర్వాత కూడా అట్లాగే ఉంటుంది. దానివలన ఎవ్వరి చైతన్యమూ విస్తరించదు-ఎక్స్‌రేవలన ఊపిరి తిత్తులు విప్పారుతవా? ఇదీ అంతే. కవళికలు మారవచ్చు. అంతే'' అన్నాడు. ఆ వైద్యుడు.

ఏమిటా మార్పు? అనే ప్రశ్న ఉదయించవచ్చు. ఇతర మాదకద్రవ్యాలు సేవించే వారిపై దీనిని ప్రయోగిస్తే, వారిలో మార్పు రావచ్చు- వాళ్లు ఆ దురలవాటును వదలు కోవచ్చు. చనిపోయే వాళ్లు పడే ఆవేదనలు, వేదనలు దీనివలన సమసిపోతాయంటాడు చికాగో వైద్యుడు ఎరిక్ కాస్ట్. ఏదో జరగనున్నదనే ఆదుర్దా, ప్రస్తుతం పీడిస్తున్న వేదన ఈ మందు వలన పటాపంచలవుతాయి- ఇటువంటి నిర్వాణ సుఖాన్ని ఆపేక్షించే యువకులు అనేకులు ఉంటారు. ఈ అపేక్షతోనే దీనికి పలువురు దాసులవుతున్నారు. ఆలస్యాలు సహించలేకపోతే, భారం సడలకపోతే, తికమక వచ్చిపడ్తుంది. దానికి ఈ మందు ఉపయోగిం

చనూ వచ్చు; కానీ, బాధ్యతను గురించిన ఆదుర్దా వదలిపోనందువలన, యాత్ర (మందు సమకూర్చే మానసిక యాత్ర) సానుకూలం కాదనేది తథ్యం.

ఇంతకూ ఎల్‌ఎస్‌డిని, దాని గుణవిశేషాలన్నీ తెలిసిన విజ్ఞాని అజమాయిషిలోనే, ప్రయోగించాలి. మానసిక స్థితిగతుల కల్పన కోసం జరిగే పరిశోధనా ప్రయోగాలలో ఎల్‌ఎస్‌డి పాత్ర ఉన్నది. ఇదిఎంత నికృష్ట 'అతిమాదక ద్రవ్యం' అయినా, ఈ పరిశోధనా ప్రయోగాలను ఎవ్వరూ ఆపివేయరు గదా. ఇదొక ''మతి మందు''. కొత్త మందులు వచ్చి పడ్తున్నాయి. ''ఆర్‌ఎన్‌ఏ'' నుంచి తయారు చేసిన చిన్న మాత్ర ఒకటి చదువులో తెలివితేటలు బాగా ఇస్తుందంటున్నారు. కొద్ది కాలంపోతే, ఏమి చదువుతున్నావు అని అడిగే బదులు ఏం మతిమందు తీసుకుంటున్నావు అని అడుగుతారేమో!

అన్నట్లు-డాక్టర్ హాఫ్మన్‌కు స్టాక్‌హోంలోని కరోలింగ్‌స్కా సంస్థవారు ఒక చిరుద్దాన్ని ఇచ్చి (ఎల్‌ఎస్‌డి కనిపెట్టినందుకు), పరిశోధనను బాగా సాగించడానికి ప్రోత్సాహం ఇచ్చారు. పరిశోధన ఆగదు, ప్రయోగాలు ఆగవు. ఈలోగా మానసిక బలహీనులు ఈ ప్రవాహంలో పడి కొట్టుకు పోవచ్చు- కొట్టుకు పోకుండా చేయడానికి ఉద్యమాల లాగానే ప్రయత్నాలు కొనసాగనూ వచ్చు, ఈ రెండూ మానసికంగా వేర్వేరు పంథాలు. ★

# SHORT STORY

**Isn't uncertainty unsettling for a good story?**

All good stories leave to you a certain part of the dream that you have to add. A good storyteller knows very well that if he closes completely then automatically something is limited, restricted. He has to give the punchline and then go a little further, to open. For instance, there is a classic story from the East. There's a man in a street, near a streetlamp. He is looking for something under the lamp at night. Another man comes by and says,

"Are you looking for something?'

"Yes."

"What are you looking for?"

"My key," says the other man.

"You lost your key?"

"Yes."

"You lost your key here?"

"No."

"So why are you looking for your key here?"

"Because here there is light."

That's a very classic story. Absolutely beautiful. You better look where there is light. If you don't find your key you'll find something else. The story pleases the scientists no end.

## మేధావుల మెతకలు-2

# జాన్ పాల్ సార్త్ర

సేకరణ:
— అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఇరవైవ శతాబ్ది మధ్య కాలాన్ని ఒక ఊపు ఊపిన అస్తిత్వవాదాన్ని గురించి విననివారు ఉండరు. ఎందుకంటే రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వపు భ్రమలు పటాపంచల య్యాయి. యుద్ధం 'మరుభూమి అను భూతి' (Waste Land Feeling) ని ప్రపంచానికి ఇచ్చింది. మానవ సమస్యల పరిష్కారానికి మనిషి ఇక ఏ మాత్రం ఆదర్శ రాజ్యా (Utopia) ల ఇంద్రజాలాన్ని ఆశ్రయించలేదు. తనలో తానే ఒక 'నవీకృ తార్థాన్ని' వెతుక్కోవాలి. ఈ స్థితికి సమా ధానంగానే అస్తిత్వవాదం రంగప్రవేశం చేసింది. పాత దర్శనాలు మార్గ దర్శకాలు కావు. ఎలాగంటే వాటి నిండా సార్వత్రి కాలు, అమూర్త భావనలు, ఆదర్శ రాజ్యాలు తప్ప మరేమీ లేవు. వీటితో విసిగి వేసారిన మానవునికి అస్తిత్వవాదం ఒక 'కొత్త ఎరుక'ను ఇచ్చింది. ''అస్తిత్వం సారం కంటె ముందు'' - అంది.

మరి ఏమిటి ఈ అస్తిత్వవాదం? ఎవరికి తోచిన సమాధానం వారు చెప్పారు. ఒక టోపీని పది మంది ధరించిన తరువాత దాని ఆకృతి పది రకాలుగా మారినట్లే, అస్తిత్వ వాదం గూడా పదిమంది చేతుల్లో పదిరూ పాలు దాల్చింది. ఫలితంగా అస్తిత్వవాదా నికి ఒక నిర్దిష్టార్థం లేకుండా పోయింది. అందుకే జాన్ పాల్ సార్త్ర ''అది ఒక కఠోర తత్త్వం, అది అందరికీ అందుబాటులో ఉండేది కాదు, తత్వశాస్త్రంలో విశేషకృషి చేసిన వారికే అది అర్థమవుతుంది'' అన్నాడు.

మరి అలాంటప్పుడు అస్తిత్వ వాదాన్ని నిర్వచించడం అంత తేలికైన పనికాదు. ఎందుకంటే ముఖ్యంగా అస్తిత్వ వాదం రెండు రకాలుగా ఉంది. ఒకటి ఆస్తిక అస్తిత్వ వాదం; దీని ప్రధాన తాత్వికులు జాస్పర్స్, మార్సెట్‌లు. రెండో రకం అస్తి త్వవాదం నాస్తిక అస్తిత్వ వాదం; ఈ సంప్ర దాయానికి చెందిన వారు హైడెగర్, ఫ్రెంచ్ అస్తిత్వవాదులతో కలుపుకొని జాన్‌పాల్ సార్త్ర అయితే ఈ రెండు రకాల అస్తిత్వ వాదులు ఒక విషయం మీద మాత్రం అంగీక రించారు. ''అస్తిత్వం సారం కంటె ముందు''

నాస్తిక అస్తిత్వవాద ప్రముఖుడైన జాన్ పాల్ సార్త్ర ఈ శతాబ్దంలో మరే ఇతర దార్శనికుని కంటె గూడా ప్రపంచ జనాళి వైఖరిని, ముఖ్యంగా యువతను ప్రభావితం చేశాడు.

రసెల్ దృష్టిలో తత్త్వం ఆకాశంలో ఎంతో ఎత్తున ఉంటుంది. అందుకని దానిని మామూలు మనుషులు ఎవరూ అంత ఎత్తుకు ఎగిరి అందుకోలేరు. అందువల్ల దానిని రసెల్‌లాంటి దార్శనికులు వడకట్టి చిన్న చిన్న మోతాదులలో నీరుకార్చిన రూపంలో వ్యాసాల ద్వారా, ప్రసంగాల ద్వారా మామూలు జనాలికి అందజేయాలి. పానశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో దర్శనాలను చర్చించి బోధించే ఫ్రాన్స్‌లో పుట్టిన జాన్‌పాల్ సార్త్ర దృష్టి వేరు. ఎటువంటి తత్త్వాన్ని అయినా నాటకాలు, నవలలు ఇంకా ఇతర సాహిత్య ప్రక్రియల ద్వారా మామూలు జనానికి అందించవచ్చు. అలాగే అతడు తత్త్వాన్ని ''ఉండడం -ఉండక పోవడం'' (Being and Nothingness) అనే తన దార్శనిక గ్రంథం కంటె గూడా, తన నాటకాలు, నవలలు, కథానికల ద్వారా ప్రచారం చేశాడు. ఇవే అతడికి మంచిపేరు తెచ్చిపెట్టాయి.

జాన్‌పాల్ సార్త్ర 21 జూన్ 1905లో పుట్టాడు. తల్లికి గారాల ముద్దు పట్టి, గారాబు బిడ్డ ఎలా తయారవ్వాలో అలాగే తయారయ్యాడు. అతడికి 15 నెలల వయస్సులో తండ్రి గతించాడు. తల్లి మరొకరిని ఒక పారిశ్రామికవేత్తను వివాహ మాడింది. తండ్రి మరుగుజ్జుతనం తప్ప అతడినుంచి ఇతడికి సంక్రమించింది ఏమీ లేదు.

తన జీవిత చరిత్ర 'మాటలు' (Words) అనే గ్రంథంలో, తనపై తండ్రి ప్రభావం ఏమీలేదని, అతడు తన తల్లి పడక గదిలో ఒక ఛాయా చిత్రం తప్ప, అంత కంటె ఏమీలేదని రాసుకొన్నాడు.

ఎనిమిది సంవత్సరాలు వచ్చే దాక అతడికి తల్లి జుట్టు కత్తిరించలేదు. ఆడపిల్ల జుట్టులా జుట్టు. అందుకే తల్లి అతడికి ఆడపిల్లల బట్టలు వేసేది. అతడికి బాల్యం స్వర్గంలా గడచింది. అందరికీ వంగి లొంగి ఉండే తల్లి అతడికి అన్ని సేవలు చేసింది. 'అందగాడని' మెచ్చుకొనేది. ఈ భావమే అతడి మనస్సులో నాటుకొంది. ఒకసారి, ఫ్లాబర్ట్ రాసిన 'మదామ్ బోవరీ' ని చదవడానికి తల్లిని అనుమతి కోరాడు. అప్పుడామె ఇలా అంది. ''నా చిన్నారి ఈ వయస్సులోనే అంతటి పుస్తకాలు చదివితే, పెద్దయిన తరువాత ఏమి చేస్తాడో?'' ''ఏం చేస్తాడు, వాటిని జీవిస్తాడు'' అన్నాడు సార్త్ర. ఇదంతా అతడు తన జీవిత చరిత్ర ''మాటలు''లో రాసుకొన్నాడు. అతడి నాలుగో ఏట, కుడికంట లేచిన చిన్న గడ్డతో స్కూలులో చేరినప్పుడు కాని, తల్లి తన అందాన్ని గురించి చెప్పిన అసత్యాన్ని అతడు గ్రహించలేక పోయాడు. ఈ అంద వికారానికి పిల్లలంతా ఏడ్పించే వాళ్ళు. తన్నే వాళ్ళు. ఈ అందవికారాన్ని అదిగమించడానికి ఆడవాళ్ల వెంట పడవలసి వచ్చిందని అతడు తన War Diaries లో చెప్పుకొన్నాడు.

విద్యారంగంలో బాగానే రాణించాడు. మంచి విద్యాలయాల్లో చదివాడు. పద్యాలు, నవలలు, నాటకాలు, కథలు, పాటలురాశాడు. పియానో వాయించాడు. మల్ల యుద్ధం చేశాడు. జీవితంలో మొదటి అమ్మాయిని, సైమన్ జొలివాను చేరదీశాడు. ఈ అమ్మాయి పొడగరి. పొట్టివాడైన తనకు పొడగరి ఆడవాళ్లంటే ఇష్టం. డిగ్రీ పరీక్షల్లో తప్పి, రెండవ సారి ఫస్టున వచ్చాడు. తరువాత ఇతడు చేరదీసిన

రెండవ మహిళ, జీవితాంతం వివాహం లేకుండా ఇతడికి భార్యగా ఉన్న సైమాన్ డి బోవార్. ఈమె రెండో ర్యాంక్‌లో వచ్చింది. రేమండ్ ఆరన్, పాల్ నిజాన్, సైమన్ డి బోవార్‌లు లాంటి మహామహులు అతడి సమకాలీనులు. అతడు స్కూలు మాస్టరుగా చేరాడు.

రాజకీయంగా అతడు ఏ సంప్రదాయానికీ చెందిన వాడు కాదు. బూర్జువాలను ద్వేషించే వాడే గాని మార్క్సుని కౌగిలించుకోలేదు. అయితే సానుభూతిపరుడే. మార్క్సుని అసలతడు, అక్కడక్కడ ఏ కొద్దిగానూ తప్ప, లోతుగా అధ్యయనం చేయలేదు.

1930లో అతడు గురువుగా ఉండగా విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చేవాడు. కావాలంటే విద్యార్థులు క్లాసుల్లో చొక్కాలు తీసివేసి కూర్చోవచ్చు. సిగరెట్లు కాల్చవచ్చు. విద్యార్థులు ఏమైనా చేయవచ్చు. నోట్సు రాసుకోనక్కరలేదు. వ్యాసాలు సమర్పించ నక్కరలేదు. సార్త్ర సందేశం ఏమింటంటే, ''వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ ఉంది. అతడి కర్మలకు అతడే పూర్తిగా బాధ్యుడు'' ఇలాంటి భావనలతో ఈ రోజుల్లోనే తాత్విక సంబంధమైన ఒక నవల రూపు దిద్దుకొంటోంది. దానికతడు 'విషణ్ణత' (Melancholia) అని పేరు పెడదామనుకున్నాడు. కాని దానికి పబ్లిషర్స్ 'వికారం' (Nausea) అని పేరు పెట్టారు. ఈ పేరు ఎంతో బాగుండడంతో దీనినే అతడు ఖాయం చేశాడు. ఆ పుస్తకంలో అతనే నాయకుడే ననే విమర్శలు గూడా వున్నవి.

యుద్ధాత్పూర్వ రాజకీయాకాశంలో ఇతడు మిణుకు మిణుకు మనే నక్షత్రమైన కాదు. అందుకని ఇతడు నాజీల దృష్టిలో పడలేదు. అందుకని ఇతడు వారిని గురించి తీవ్రంగా నిందించలేదు. యుద్ధ ఖైదీగా విడుదలైన తరువాత తత్త్వశాస్త్రాచార్యుడుగా చేరాడు. ఆ తరువాత 1945లో జర్మనీ ఆక్రమణను గురించి ఒక వ్యాసంలో ఇలా అంటాడు. ''నేను ఇలా రాస్తే ప్రజలు నన్నెలా అర్థం చేసుకుంటారో తెలియదు గాని, జర్మనుల దారుణాలు సహించ రానివే అయినా, అవి మాకు బాగా సరిపోయాయి.... వారి ఆక్రమణలో ఉన్నంత స్వేచ్ఛగా మేమెప్పుడూ లేము''.

సిద్ధాంతాలను వల్లెవేశేవాడే కాని కార్యశూరుడు కాదు. అతడు నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెడితే నాజీ సైన్యం రైళ్ళను పేల్చి ఉండవలసిన వాడు కాని ఆ పని చేయలేదు. అతడి దర్శనం క్రియాశీలకం. ఎలాగంటే ''ఒక మనిషి శీలాన్ని, అర్థాన్ని నిర్ణయించేవి అతడి కర్మలు (చేష్టలు) కాని అతడి శుష్క ఆదర్శాలు, దృక్పథాలు, మాటలు కావు. ''అని అతడే చెప్పుకొన్నాడు. దమనాధిపత్యాలకు ఇతడు వ్యతిరేకి. మరిలాంటివాడు యూదుల అణచివేతకు ఎదురాడలేదు. వారి గురించి సానుభూతితో ఒక మాట రాయలేదు. బదులుగా నాటకాలు రాసుకొంటూ కూర్చొన్నాడు.

అతడి ముఖ్య దార్శనిక గ్రంథం 'ఉండడం ఉండక పోవడం' (Being and Nothingness) 1942-43లో విరచితమైంది. చలిరాత్రులు, ఏకబిగిని నాలుగు గంటలు రాశేవాడు, 'Cafe Flore'లో కూర్చొని, పాల టీ త్రాగుతూ. ఇది 722 పుటల సుదీర్ఘ గ్రంథం పేజీల నిండా

మసాళా వాక్యాలు. అందులో కొంతవరకు మొత్తంమీద రంధ్రాన్వేషణం జరిగితే, మరి కొంత వరకు గుదాన్వేషణం. ''ఇటలీ శైలిలో రతి చేయడం ఎలా? అనే విషయాల మీద పరిశోధన సాగింది'' అని 1983లో ప్రచురితమైన ఉత్తరాలలో ఉంది. ఇది గొప్ప దార్శనిక గ్రంథమే, అయినా అతడికి పేరు తెచ్చి పెట్టింది మాత్రం నాటక రంగం. అతడి నాటకాలు; ఇవి ధనాన్ని కూడా ఆర్జించి పెట్టాయి. ఈ నాటకాల్లో ముఖ్యమైంది, ''ఇది బయటికి దారి కాదు'' (No Exit) అనే నాటకం. ఇది 27 మే 1944న ప్రారంభమైంది. ఇందులో ముగ్గురు వ్యక్తులు ఒక గదిలో కూచొని వుంటారు. ఈ గది నరకానికి అనుబంధంగా ఉంటుంది. ఈ నాటకాన్ని రెండు స్థాయిలలో చూడాలి. ఒక స్థాయిలో ఇది మానవ శీలం మీద వ్యాఖ్యానం. ఆ వ్యాఖ్యాన సందేశం ఏమిటంటే, ''మనమూ మన సంస్కృతి తప్ప మిగతా జనం, జాతులు సంస్కృతులూ అన్నీ నరక సదృశ్యాలే''. ఇహ రెండవ స్థాయిలో ఈ నాటకం, హైడెగర్‌ను సమూలంగా పరివర్తితం చేసి, క్రియాశీలతను, నర్మగర్భంగా ధిక్కారాన్ని ప్రబోధిస్తుంది. ఈ నాటకానికి అటు విమర్శకుల నుంచి, సామాజికుల నుంచి బహుళ ఆదరణ లభించింది. ఫ్రాన్స్ స్వర్ణయుగాన్ని ఆవిష్కరించిన సాంస్కృతిక సంఘటనగా దానిని అభివర్ణించారు. ఫ్రెంచి ప్రభుత్వపు అత్యున్నత పురస్కారాన్ని పొందాడు కూడా!

'అస్తిత్వవాదం' పదాన్ని నిర్వచించమన్నప్పుడు సార్త్ర ''అస్తిత్వ వాదమా? అదేమిటో నాకు తెలియదే'' అన్నాడు. నా తత్వం ''అస్తిత్వ దర్శనం'' (Philosophy of existence) అసలు ఈ ''అస్తిత్వ వాదం (Existentialism) అనే పదాన్ని పత్రికల వాళ్ళు సృష్టించినట్లు కనిపిస్తున్నది. తరవాత తరవాత సార్త్ర ఈ పదాన్నే స్వీకరించాడు. ఆ తరువాత అతడిచ్చిన ఒక ఉపన్యాసానికి 'అస్తిత్వవాదం ఒక మానవవాదం' (Existentilism is a Humanism) అని పేరు పెట్టాడు. ఈ ఉపన్యాసం తరువాత గ్రంథస్థమైంది. అందులో అతడు అస్తిత్వవాదాన్ని ఇలా వివరించాడు. ''మనిషిని, అతడు చేసిన కర్మల (పనుల) ఆధారంగా, అస్తిత్వవాదం నిర్వచిస్తుంది. అతడి ఆశలు, ఆశంసలు కర్మలోనే ఉన్నాయి. మానవుని బ్రతుకును సంభావ్యం చేసే, సాధ్యం చేసే ఒకే వస్తువు కర్మ. అందువలన మనిషి తనను తన జీవితానికి అంకితం చేసుకొంటాడు. ఆ విధంగా అంకితం చేసుకొన్న మానవుడు, దాని ఆధారంగా తన ప్రతిమను (సారాన్ని) తయారించుకొంటాడు. దీనికి వెలుపల, ఆవల మరేమీ లేదు''. 1945 తరువాతి ఐరోపావాసి 'నూతన అస్తిత్వ వ్యక్తి'గా అతడు ఏకాంతంగా, ఏ కారణం లేకుండా ఉన్నాడు''. మనిషికి స్వేచ్ఛనుంచి విముక్తి లేదు అనడంలో సార్త్ర ఉద్దేశం ఇదే. ఈ తారక మంత్రం, యుద్ధానంతర నవతరాన్ని - ముఖ్యంగా యువతను- అన్ని రకాల, వర్గాల వారిని- ఏకాంతులను, ఉదారులను, నిష్ఠురులను, ఒక మాదిరి దౌర్జన్యవాదులను, విశిష్ట జన వ్యతిరేకులను- అందరిని ఆకర్షించింది.

ఆయనకు పత్రికలు విస్తృత విశిష్ట ప్రచారాన్ని కల్పించాయి. అయితే అతడిపై దాడి చేసిన పత్రికలూ లేక పోలేదు. ఒక కాథలిక్ దినపత్రిక అతడిని విమర్శిస్తూ, ''పద్దెనిమి

దవ శతాబ్ది హేతువాదం కంటే, పందొమ్మి దవ శతాబ్ది సకారాత్మకవాదం కంటె అస్తిత్వకవాదం దుర్మార్గమైంది'' అంది. స్టాలిన్ సాంస్కృతిక రాయబారి ఫెడయేవ్ (Fedayev) సార్త్రని ''టైప్‌రైటర్‌తో ఉన్న నక్క'' ''ఊటకలంతో ఉన్న సివంగి'' అని వర్ణించాడు. ఎవరు ఎమన్నా, ఎన్ని పేర్లు పెట్టినా అతడి పేరు, ఇనుమడించిందే కాని తరగలేదు. "Les Temps Moderns" ఒక సంచికలో ఇలా రాసింది: ''ఫ్రాన్స్ చితికి పతనమైంది. అది మిగిల్చిందీ, వారసత్వంగా ఇచ్చిందీ ఫ్యాషన్లను, సాహిత్యాన్ని మాత్రమే; కాని అస్తిత్వవాదం ఫ్రాన్స్ ప్రతిష్ఠను ఇనుమడింప జేసి, క్షీణయుగంలో వ్యక్తిత్వాన్ని నిలబెట్టడానికి వచ్చింది. సార్త్రను అనుకరించడం, అనుసరించడమంటే దేశభక్తిని ప్రదర్శించడమే'' అస్తిత్వవాదం చదువుకొనేది కాదు. అనుభవైకవేద్యం మాత్రమే! దానిని వివరించ వలనువడదు. జీవించ వలసిందే. లక్షలాది యువతకు సార్త్ర ఆధ్యాత్మిక నాయకుడయ్యాడు.

1905లో పుట్టిన సైమన్ డి బోవార్ (Simone de Beauvoir) 1925ల నుంచే సార్త్రకు చేరువైంది. ఆవిడ చాలా తెలివైంది; మంచి రచయిత్రి. సాంకేతికంగా చూస్తే తత్వశాస్త్రంలో సార్త్రకంటె ఆవిడే దిట్ట. పారిస్ విశ్వవిద్యాలయంలో మంచి పేరు మోసిన తత్త్వశాస్త్ర విద్యార్థిని. మొదటిగా సార్త్ర ఈమెను చేరదీసినప్పుడు, ''నేటి నుంచి నిన్ను నా రెక్కల క్రింద పొదుగుతాను'' అన్నాడు. ఈ పొదుగుడు, ఆమెకు సుఖాసుఖ మిశ్రమాన్నే ఇచ్చింది గాని పూరిత సంతోషాన్ని ఇవ్వలేక పోయింది. ఈమె అతనికి జీవితాంతం ఉంపుడుగత్తె, భార్య (వివాహం లేకుండా) వంటగత్తె, పని మనిషి, మానేజరు, సంరక్షకురాలు, నర్స్- అన్నీ తానే అయింది. అయితే అతడికి ఆమె మీద, ఆమెకు అతడిమీద ఎలాంటి చట్టపరమైన అధికారాలు, హక్కులు లేవు. అయితే ఈమె అతడిని కలిసిన దగ్గరనుంచి అతడికి బానిస అయింది. 'స్త్రీ పుట్టుకతోనే స్త్రీ కాదు, ఆమె అలా మలచబడ్డది' అనే వాక్యంతో మొదలైన 'రెండో లింగం' (Second sex) అనే గ్రంథం రాసిన బోవార్, స్త్రీ విమోచనోద్యమానికి ఆద్యురాలైన బోవార్, నిజంగా నిజజీవితంలో ఈ ఆశయాలకు తిలోదకాలిచ్చి, మోసపూరిత జీవితాన్ని, సార్త్ర దోపిడికి గురికావడాన్ని ఎన్నుకొన్నదంటే ఆమె చిత్తశుద్ధిని మనం శంకించాలి. ఆమెను ఎలా అర్థం చేసుకోవాలి? సార్త్ర ఆమెను ఎలా లొంగదీసుకుందీ ఎక్కడా చెప్పడు. పోనీ ఆమె అయినా వారిద్దరి మధ్య సంబంధాన్ని గురించి నిజాయితీతో చెబుతుందా అంటే అదీ లేదు. మొత్తానికి వారి మధ్య సంబంధం లైంగికమే అయినా, ఆమె అతడికి బానిస కావడానికి కారణం మాత్రం అది కాదు. అది బౌద్ధికం; ఎందుకంటె అతడికి ఇతర స్త్రీలు ఎవ్వరూ దొరకనప్పుడే అతడు ఆమె వంక చూసేవాడు. అసలతడు ఆడవాళ్లను జయించవలసిన, ఆక్రమించవలసిన వస్తువులుగా భావించిన మగ దురభిమాని. అతడికి మగవాళ్ళ కంటే ఆడవాళ్ళంటే ఎక్కువ ఇష్టం. వారితోనే మాటాడేవాడు. కాలం గడిపేవాడు. ''రేమండ్ ఆరన్‌తో తత్త్వం మీద మాటాడడం కంటె ఆడవాళ్లతో తీపి గుసగుసలు ఇష్టం'' అని తన War diariesలో రాసుకున్నాడు. ఇందులోనే ఇంకా ఇలా రాశాడు. ''ఆడవాళ్ళను అడవి జంతువును మచ్చిక చేసుకొన్నట్లు చేసుకోవాలి. కాని ఇలా

చేయడం ఎందుకంటే ఆమెను ఆటవికత నుంచి మానవ దశకు లేవనెత్తడానికే''

అతడు బోవార్‌కు మరులుగొలిపి, ప్రేమాయణంలోకి దించినప్పుడు ఆమెతో చాలా స్పష్టంగా చెప్పాడు తనకు చాలా మంది అమ్మాయిలతో పడుకోవాలని ఉందని. ఇందుకు ఆవిడా సమ్మతించింది. అసలు అతడి ఉద్దేశంలో ప్రేమ రెండు రకాలు. ఒకటి అసలు ప్రేమ లేదా ఆవశ్యక ప్రేమ; రెండవది అంచు ప్రేమ (అనుషంగిక ప్రేమ). ఈ రెండవ రకం ప్రేమ క్రిందకు వచ్చే వాళ్ళంతా అంచుమీది ఆడవాళ్ళు. కాని బోవార్ ఈ కోవకు చెందదు. మొదటి రకం ప్రేమకే చెందుతుంది. అవసరమనుకుంటే ఆమె కూడా పై పై తిరుగుళ్ళు తిరగవచ్చునన్నాడు. ఆమె రాసిన 'చాందసులు' (The Mandarins = పాత పద్ధతులను వీడని వారు) అనే నవలలో తానెలా ఆర్థర్ కోజ్లర్‌ను మరుగు గొలిపి విమోహితుణ్ణి చేసిందీ వర్ణించింది. ఆ వర్ణనను చూసి సార్త్ర నవ్వాడు. ఆవిడ మరొక అంచు ప్రేమికుడు అమెరికన్ నవలాకారుడు నెల్సన్ ఆల్గ్రిన్. ఇతడితో సంబంధాన్ని, అదే నవలలో వర్ణిస్తూ, అతనిని మారుపేరుతో పేర్కొంది. అయినా అతడు ఒక ఇంటర్వ్యూలో ఇలా ఉల్లేఖించడంపై, తన ఆగ్రహాన్ని వెలిబుచ్చాడు. ఆమె అంతటితో ఊరుకోక (The Prime of Life) అనే తన స్వీయ చరిత్ర రెండవ సంపుటంలో అతని గురించి అతని పేరు పెట్టి రాయడమే కాక, ధృవపత్రంగా అతడి ప్రేమ లేఖనే ఉటంకించింది. ఈ సంగతులను ఆల్గ్రిన్ ఒప్పుకొంటూనే ఇలా అన్నాడు. ''ప్రేమ లేఖలను ఎవరైన రహస్యంగా అట్టి పెట్టుకొంటారు. ప్రపంచంలో నేను ఎన్నో వేశ్యావాటికల్లో విహరించాను. అక్కడ ఆడవాళ్ళంతా - అది ఇండియా కానివ్వండి, కొరియా కానివ్వండి - తలుపులు మూస్తారు. కాని ఇదెక్కడి ఆడదో తలుపులు బార్లగా తెరిచి అందరిని చూద్దురుగాని రమ్మని ఆహ్వానిస్తుంది'' ఈ విషయాలు ఇంటర్వ్యూలో చెప్పి, అదే రాత్రి గుండెపోటుతో అతడు మరణించాడు.

ఆమె ఎంత ''అసలు ప్రేమికురాలైనా'' సార్త్ర తన అంచు ప్రేమలను గురించి రాసిన ఉత్తరాలను భరించడం కష్టం. Letters an castore లో ఇలా ఉంది. ''ఇదే మొదటిసారి నేను ఒక నల్లజుత్తు అమ్మాయితో పడుకోవడం. ఆ అమ్మాయి జుత్తు గమ్మత్తుగా ఉంది. ఆమె శరీరం నుంచి ఏదో మరులుగొలిపే వాసన. వెన్నుపూస చివర జుట్టు కుచ్చు. తెల్లగ నిగనిగలాడే శరీరం. ఊదే బూర (సంగీత వాయిద్యం) లాంటి సుడులు విచ్చుకొనే నాలుక, నా గొంతులోకి వెళ్ళింది'' ఈ వర్ణన బోవార్ ఎలా భరించిందో?

సార్త్రకు అనేక మంది అమ్మాయిలతో సంబంధాలుండేవి. అయితే వీటిని అన్నింటిని బోవార్ సమదృష్టితో చూడలేకపోయింది. మారెవిలీ అనే ఆమెను అసహ్యించుకొనేది. అంతకంటె ఓల్గాను ద్వేషించింది. ఆ తరువాత వరసలో ఓల్గా సోదరి బోవార్ శిష్యురాలు అయిన వాండా సార్త్ర ఉంపుడు గత్తె అయింది. బోవార్ సర్దుకోక చేయగలిగింది ఏమీ లేదు. ఎప్పుడూ త్రికోణ సంబంధం. అతడు 'ఆమె' మరో ఉంపుడు గత్తె. ఈ అమ్మాయి అతడికిగాని ఆమెకుగాని శిష్యురాలై ఉంటుంది.

1940ల నాటికి సార్త్ర తన శిష్యురాళ్ళను చెడగొడుతున్నాడన్న పేరు మారుమ్రోగిపోయింది. రాబర్ట్ ఫ్రాన్సిస్ ఇలా రాశాడు. ''మాకందరికి సార్త్ర ఏమిటో తెలుసు. అతడు తన శిష్యురాళ్ళ లోదుస్తులను (Under Wear) అధ్యయనం చేసే విచిత్ర దార్శనికాచార్యుడు''. బోవార్ గూడా అధ్యాపకురాలు కావడం, ఆవిడ దగ్గర చదివే ఆడపిల్లలు కావలసినంత మంది ఉండడంతో వారిలో ఎక్కువ మందికి సార్త్ర మరులుగొలిపాడు. అతడి కామానికి గురయ్యారు. ఒక విధంగా ఆమె వారిని ప్రోత్సహించి తార్పుడుగత్తె పాత్రను నిర్వహించింది. ఆమె తార్చిన వాళ్ళల్లో రష్యన్ ప్రవాసుల అమ్మాయి నటాలి ఒకతే. బోవార్‌కు నచ్చిన, మెచ్చిన శిష్యురాలు ఈమె. ఈ అమ్మాయి తలిదండ్రులు బోవార్‌పై కేసు పెట్టారు. స్నేహితులు జోక్యం చేసుకొని కేసును ఉపసంహరింపజేశారు. కాని ఫ్రాన్స్‌లో ఎక్కడా ఆమె చదువు చెప్పకుండా లైసెన్సు రద్దు చేశారు.

సార్త్ర వయస్సు పెరిగిన కొలది 17, 16 సంవత్సరాల పడుచులు కావలసి వచ్చారు. ఆ అమ్మాయిలను తాను చట్టపరమైన అర్థంలో దత్తు చేసుకొంటున్నాననే వాడు. అతడు బోవార్‌కు చెప్పేవన్నీ అబద్ధాలే. ఒక అమ్మాయితో తాను విసిగి పోయానని బోవార్‌కు చెప్పాడంటే, అతడు ఆమెను వివాహ మాడడానికి రహస్య ప్రతిపాదన చేస్తున్నాడన్న మాట. 1940-48 ప్రాంతంలో బోరిస్ వియాన్ భార్య, తేనె రంగు అమ్మాయి మైఖిలి, అందమైన ఓల్గా సోదరి వాండా, నటి ఎవిలిన్‌రే (ఈమె కోసం తన చివరి నాటకంలో ఒక పాత్ర రాశాడు), పదిహేడు సంవత్సరాల అర్లెటీ (ఈమెనే బోవార్ అతిగా ద్వేషించింది ఈమెనే సార్త్ర చివరకు దత్తు చేసుకొంది), గ్రీకు యువతి హెలీన్ లాసిథియోటకిన్ -వీరందరినీ తన జనాభాలో చేర్చుకొన్నాడు. ఒకరికి తెలియకుండా ఒకరిని - అందరినీ మోసగించాడు.

ఇక ఆడవాళ్ళ గొడవ వదిలేస్తే, మగవాళ్లతో అతడికి పెద్దగా పడేది కాదు. ముఖ్యంగా తనతో సరిసమానులైన మేధావులతో అసలే పడేది కాదు. అసలు రహస్యం ఏమిటంటే, ఈ మేధావులు ఎప్పుడైనా అతడి వాదనలను తేలికగా అలవోకగా, ఊదివేయగలరు. ఉదాహరణకు రేమండ్ ఆరన్, ఆర్థర్ కోజ్లర్, మెర్లొపాంటీ, ఆల్బర్ట్ కాము (Albert camus) మొదలైన మేధావులతో ఎవరితోనూ పడేది కాదు. మరో కారణం ఇతడికి రాజకీయంగా స్పష్ట స్థిర దృష్టి అంటూ ఒకటి లేదు. ఆరన్ కోజ్లర్ లాంటి వారు ఒక విస్పష్ట రాజకీయ దృష్టితో ఎవరినో ఒకరినే బలపరుస్తుంటే, ఇతడు ఎప్పుడైనా, ఎవరినైనా బలపరచ గలిగేవాడు. ఇతడు మార్క్సిస్టు కాదు. ఎలాగంటే మార్క్సిజం ఇతడు చెప్పే వ్యక్తి స్వేచ్ఛకు వ్యతిరేకం; అయినా, 1940లో ఆరన్, కోజ్లర్‌లు కమ్యూనిజాన్ని ఖండిస్తుంటే, ఇతడాపని చేయలేక పోయాడు. వారిద్దరితో ఇతడికి గల తగవుకు ఇదో కారణం.

1952 నాటికి అతడు సంధిగ్ధావస్థనుంచి ఒక నిర్ణయానికి తెమిలి ఒక కొలిక్కి వచ్చాడు. కమ్యూనిస్టు పార్టీని బలపరచాలనే ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒక ప్రక్క స్టాలిన్ నేరాలన్నీ బహిర్గతం అవుతున్నప్పుడు, మరో ప్రక్క వామపక్ష మేధావులంతా కమ్యూనిస్టు పార్టీనుంచి బయటికి

వస్తున్న తరుణంలో కమ్యూనిస్టు పార్టీని సమర్థించడమంటే, తల క్రింద కాళ్ళు, పైన పెట్టి నడవడమే. స్టాలిన్ కాంపులను గురించి అతడు నోరు మెదపలేదు. ''మానవునికి స్వేచ్ఛనుంచి విముక్తి లేదు'' అనే తన సిద్ధాంతం నుంచి స్టాలిన్ కాంపులను ఎలా సమర్థిస్తాడు? అందుకనే నెమ్మదిగా జారుకొన్నాడు. ''మేము పార్టీ సభ్యులం కాము గనుక వారి తగవులను గురించి వారి వ్యవస్థ స్వభావం గురించి ఏమీ మాటాడం''.

1954లో రష్యా పర్యటన నుంచి తిరిగి వచ్చాక ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఇదొక గొప్ప ఇంటర్వ్యూ. పాశ్చాత్య మేధావి అయిన బెర్నాడ్ షా 1930లో రష్యా పర్యటనానంతరం ఇచ్చిన ఇంటర్వ్యూ తర్వాత ఇదే గొప్ప ఇంటర్వ్యూ. అందులో సార్త్ర ఇలా అంటాడు. ''సోవియట్ ప్రజలు యాత్రలు చేయరు; కారణం వారిని ఎవరో ఆపడం కాదు. వారు తమ అద్భుత దేశాన్ని వదలి బయటికి రా నిచ్ఛగించరు. అక్కడి పౌరులు రష్యాను విమర్శిస్తారు కూడా. మనం ఇక్కడ మనదేశాన్ని విమర్శించే కంటె ఎక్కువగానే విమర్శిస్తారు. రష్యాలో విమర్శకు పూర్తి స్వేచ్ఛ ఉంది''.

తరువాత చాల సంవత్సరాలకు ఆ ఇంటర్వ్యూలో తాను చెప్పినదంతా అబద్ధమేనని చెప్పాడు. సన్నివేశాలు (Situations) అనే గ్రంథంలో ''1954లో నా రష్యా యాత్రానుభవాల గురించి అబద్ధం చెప్పాను. వాస్తవానికి అబద్ధమనే మాట ఘాటైన పదమే కావచ్చు. నేనొక వ్యాసం వ్రాశాను. అందులో రష్యా గురించి నేను నమ్మని అనేక స్నేహ పూర్వక విషయాలు చెప్పాను. అలా ఎందుకు చెప్పానంటే, ఇంటికి తిరిగి రాగానే అతిథులను గురించి చెడుగా మాట్లాడం చేయలేము గదా. ఇదొక కారణం. మరో కారణం, నిజంగా నా భావాలకు రష్యాను మధ్య సంబంధాలలో నేనెక్కడ ఉన్నానో నాకే తెలియదు.

జాన్‌పాల్ సార్త్ర మాటలవాడే కాని చేతలవాడు కాదు. అందుకే నేమో తన ఆత్మకథను ''మాటలు'' (Words) అని పేరు పెట్టుకొన్నాడు. అతను ఎప్పుడూ ఏ మాటా నిలబెట్టుకోలేక పోయినా ఒక మాట మాత్రం నిలబెట్టు కొన్నాడు. అదే మిటంటే రోజుకు ఒక పంక్తయినా రాయకుండా నిద్రపోరాదు. ఒక పంక్తికేం కర్మ, రోజుకు 10,000ల పదాలు రాసేవాడు. విపరీతంగా రాసిన మాట నిజం. అందులో ఎక్కువ భాగం గుణహీనం అయింది. పరిమాణమే కాని గుణం ప్రధానం కాదు అతడికి; పేజీలు నింపడం కావాలి. 1940లో బోవార్‌కు రాసిన ఒక ఉత్తరంలో ''పరిమాణాన్ని గుణంగా ఎంచాను'' అన్నాడు. ఫ్లాబర్ట్ మీద అతడు రాసిన గ్రంథం మూడు సంపుటాల్లో - 2802 పుటలు అయింది. ఇందులో ఎక్కువ భాగం అపఠనీయం ''నా దగ్గర ఉన్న సరుకు నంతా సాహిత్యంలోకి చొప్పించాను. మతం లేని లోటును సాహిత్యం పూడుస్తుంది. మాటలు జీవితం, మాటలు మాటలు, మాటలు మాటలే మూటలు, మాటలే ప్రపంచం, మాటలు (పదాలు) కేవలం అక్షర సంయోగాలు కావు. అర్థాలు కావు. అంతకంటె ఎక్కువైనవి. అవి సజీవ వస్తువులు. పదాల మార్మికత నాకు అనుభవంలోకి వచ్చింది. కొంచెం కొంచెంగా నాస్తికత్వం, అంతటిని తినివేసింది. నేను నా రాతను లౌకికీకరించాను. అవిశ్వాసిగా భాషకు అర్థమేమిటో

తెలుసుకోవలసిన అవసరంతో పదాలను చేరాను. నన్ను నేనే అనుప్రయుక్తం చేసుకొన్నాను. కాని నా యెదుట ఒక స్వప్నం - మరణాన్ని, ఒక సంతోషకర శౌర్యాన్ని, ఒక సాతత్య దురాకర్షణ క్రౌర్యాన్ని వాసన పట్టాను.'' అని అప్రచురిత రాత ప్రతులలో రాసుకొన్నాడు. దీనికి అర్థం ఏమిటి? అర్థం లేని రాతలు. జాన్‌సన్ ఒకసారి ఫ్రెంచివాళ్ళను గురించి ఒక మాట యిలా అన్నాడు. ''ఫ్రెంచి వాడు ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ ఉండవలసిందే, ఆ మాటాడేదేమిటో అతడికి తెలిసినా తెలియక పోయినా''

ఒకసారి 1958-59లలో ఫ్రాయిడ్ మీద సినిమా తీయడానికి జాన్‌పాల్ సార్త్ర, జాన్ హోస్టన్‌లు కలిసి స్క్రిప్టు రాస్తున్నారు. ఆ పనిమీద సార్త్ర వచ్చి హోస్టన్‌తో ఐర్లండ్ లో ఉన్నాడు. సార్త్రమీద హోస్టన్‌కు ఏర్పడిన అభిప్రాయాలను హోస్టన్ తన **'An open book'** అనే గ్రంథంలో రాశాడు. ''అతడి ముఖ్య లక్షణం ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ ఉండడం. అతడితో సంభాషించడం అంటూ ఉండదు; ఎందుకంటె అతడు నిన్ను మాటాడనీయడు. అసలతడు మాటాడడం ఆపితే గద. మధ్యలో నీవు అతనిని ఆపలేవు. శ్వాస తీసుకోవడానికైనా ఆపుతాడేమోనని నీవు ఎదురు చూడాలి. కాని అతడు శ్వాస తీసుకోడే. పదాలు వరదలా పొర్లి వస్తాయి''. గమ్మత్తు ఏమిటంటే సార్త్ర తను మాటాడే దానికి తానే నోట్సు రాసుకోవడాన్ని చూసి హోస్టన్ ఆశ్చర్యపోయాడు. ఒకసారి మధ్యలో హోస్టన్ ఏదో పనిమీద బయటికి వెళ్ళాడు తరువాత కాసేపటికి తిరిగి వచ్చి చూస్తే అతడు ఇంకా మాటాడుతూనే ఉన్నాడు.

ఇదే కాకపోయినా ఇలాంటిదే మరొక సంఘటన జరిగింది. సార్త్రని మాటాడవలసిందని జాన్‌వాల్, College of Philosophy లో ఉపన్యాసం ఏర్పాటు చేశాడు. ఆ ఉపన్యాసంలో అతడు తన రాతప్రతిని తెరిచి యాంత్రికంగా, ఎవరో తరుముకొన్నట్లుగా గంట నలభై ఐదు నిమిషాలు కళ్ళెత్తకుండా చదువుకు పోయాడు. హాలు కిక్కిరిసి ఉండడంతో కొందరు క్రిందపడిపోయారు. ఇది అతడు గమనించకుండానే చదువుకు పోతున్నాడు. చివరకు గత్యంతరం లేక జాన్‌వాల్ సార్త్రకు ఆపమని సంజ్ఞ చేశాడు. వెంటనే సార్త్ర, మాట పలుకూ లేకుండా, కాగితాలు చుట్టుకొని బయటకు విస విస నడిచి పోయాడు.

సార్త్రకు సంపాదన లోటు ఏమీ లేదు. డబ్బు విపరీతంగానే వచ్చేది. అయితే అతని చేతి వేళ్ళ మధ్య సందులుండేవి. వాటి గుండా అది నీళ్ళలా జారిపోయేది. అందుకే అతడు ''ధనానికి చచ్చిపోయే లక్షణం వుంది. అది నా వేళ్ళ మధ్య జారిపోతూ అంతర్ధానం అవుతూ ఉంటే ఎంతో అందంగా ఉంటుంది. అలా జరగడం నాకెంతో ఇష్టం'' అని War Diaries లో రాసుకున్నాడు. ఇతడు డబ్బు విషయంలో మాత్రం ఇతర మేధావులు లాంటి వాడు కాదు. మంచి దాతృ హృదయం కలవాడు. మంచి కార్యక్రమాలకు ఉదారంగా డబ్బిచ్చేవాడు. అసలు తనకు డబ్బుతో పని అంటూ ఉండగూడదనే వాడు. అయితే మరి అది లేనిదే ఏమీ జరగదు. ఒక్క ప్రక్క విపరీత దాతృత్వంతో అప్పుల్లో పడే వాడు. మరో ప్రక్క ఆదాయపు పన్నుల వారు. ఇతడికి తెలియకుండానే తల్లి పన్నులు చెల్లిస్తుండేది. ఒకసారి

అయితే ఒక కొత్త చెప్పుల జత కొనుక్కోవ డానికి కూడా డబ్బులులేవని బాధపడ్డాడు.

తాగుడు, స్త్రీలు అతడి ఆరోగ్యాన్ని హరించి వేశాయి. ముసలితనం ముందు గానే వచ్చేసింది. బోవార్ తన ''సార్త్రకు వీడ్కోలు'' అనే గ్రంథంలో అతడి చివరి సంవత్సరాలను కడు నిష్ఠురంగా వర్ణిం చింది. అతడి నిగ్రహ రాహిత్యం, అమ్మా యిలు తన కనుగప్పి అతడికి విస్కీ సీసాలు అందించడం, దాని మూలంగా ఎక్కువైన తాగుడు, అతని మనస్సులో మిగిలిన దానిపై అధికారం కోసం పోరాటం - ఇవన్నీ 15 ఏప్రిల్ 1980న అతడి మర ణంతో ఊరట చెందాయి. ఊపిరి పీల్చు కొన్నాయి. అతడి శవాన్ని కాటికి తీసుకు పోయేటప్పుడు, ఏభైవేల మంది దానిని అనుసరించారు. జనం చెట్ల పైకి గూడా ఎక్కారు.

1965లో రహస్యంగా అర్లెటీని కూతు రుగా దత్తత తీసుకున్నాడు. ఆ కారణాన అతడి మరణానంతరం అతడి ఆస్తికంత టికి - సాహితీ ఆస్తికి కూడా - ఆమె ఉత్తరాధికారిణి అయింది. చివరి సారిగా ఈ విధంగా బోవార్ నమ్మక ద్రోహానికి గుర యింది. తరువాత ఆమె ఐదు సంవత్సరాలే జీవించింది.

''అంచు ప్రేమ అసలు ప్రేమను జయిం చింది''. ★

మేధావుల–మెతకలు అనే శీర్షి కతో కొంతమంది మేధావులను పాఠకుల పరిచయం చేస్తున్నాము. వారంతా మేధా వులనే విషయంలో బేధాభిప్రాయం లేదు. కాని వారి జీవితం రెండోభాగం (Private life) కొంత వరకు చెప్పటానికి మాత్రమే కాని వారిని న్యూనత పరచాలని కాదని గ్రహించ ప్రార్థన.

—రచయిత

# అనార్కలీ
## (సలీం ప్రియురాలు కాదు)

— సంజీవదేవ్

అనార్కలీ అనే పేరు వినటానికి ఎంత ఆకర్షకంగా ఉంటుందో ఆ పేరు గల వ్యక్తుల రూపం కూడ చూడటానికి అంత సుదృశ్యంగా ఉండవచ్చునేమో, ఉండకపో వచ్చునేమో కూడ. నామాన్ని బట్టి రూపాన్ని ఊహించలేం.

అనార్కలీ పేరుగల రూపం సురూపంగా ఉన్నా, లేకున్నా అనార్కలీ అనే వస్తువు మాత్రం రూప సౌందర్యంతో, రంగు సొంపుతో కమనీయంగా ఉంటుంది.

సలీం రాకుమారుడు ప్రేమించినందు వల్ల అక్బర్‌చేత సజీవ సమాధి చేయబడ్డ అనార్కలీ కాదు ఈ అనార్కలీ. ఈ అనార్కలీ పేరే ఆ అనార్కలీకి పెట్టుకొన్నారు. ఆ సలీం ప్రేయసి అనార్కలీ పుట్టక ముందూ ఈ అనార్కలీ ఉన్నది. ఆమెను సజీవ సమాధి చేసిన తరువాతా ఈ అనార్కలీ ఉన్నది.

అనార్ అంటే దానిమ్మ, కలీ అంటే మొగ్గ. కనుక అనార్కలీ అంటే దానిమ్మ మొగ్గ అని. ఆ మొగ్గ పేరే కొందరు స్త్రీల పేర్లు అయాయి; లాహోర్‌లోని అనార్కలీ బాజార్ లాంటి వాటికి స్థలాల పేర్లు అయాయి.

అనార్కలీ అనేది మనుషుల పేరు అయినా, స్థలాల పేరు అయినా, మరింకే దాని పేరు అయినా, మౌలికంగా అది దానిమ్మ మొగ్గ.

దానిమ్మ మొక్కను నాటితే, మొక్క చెట్టు అయి మొగ్గను వేస్తే, మొగ్గవిచ్చి పూవు అయితే, పూవు ముదిరి కాయ అయితే, కాయ పండి దానిమ్మ పండు అవుతుంది.

దానిమ్మ పండు తినటానికి మధురంగా ఉంటుంది కాని చూడటానికి అంత సురమ్యంగా ఉండదు. పండులోని గింజలు మాత్రం రసంతో తొణికిసలాడుతూ మణి దీపాలుగా వెలుగుతుంటాయి అరుణ కాంతితో. దానిమ్మ పండుకంటే దానిమ్మ పూవు ఎక్కువ అందంగా ఉంటుంది. దానిమ్మ పూవు కంటే ఇంకా ఎక్కువ అందంగా ఉంటుంది దానిమ్మ మొగ్గ, అనార్కలీ!

దానిమ్మ నిజానికి పూలచెట్టు కాదు, పళ్ల చెట్టు మాత్రమే; ఆనందించటానికి కాక తినటానికి ఉపయోగపడే చెట్టు మాత్రమే.

గులాబీ చెట్టును ఆనందించటానికి నాటితే, దానిమ్మ చెట్టును నాటతారు తినటానికి. తినటం మాత్రం ఆనందించటం కాదా అంటే అది వేరు విషయం.

గులాబీని తినకుండానే ఆనందిస్తారు. దానిమ్మను తింటూకాని ఆనందించరు. కనుక మొదటిది సూటిగా లేక ప్రత్యక్షంగా అందే ఆనందం, రెండవది పరోక్షంగా అందే ఆనందం.

ప్రతి పళ్ల చెట్టూ పూలు పూస్తుంది. కాని ప్రతి పూల చెట్టు పళ్లు కాయదు. కొన్ని పళ్ల చెట్ల పూలకు సువాసన ఉంటుంది, రంగు ఉండదు. ఇంకొన్ని పళ్లచెట్ల పూలకు రంగు ఉంటుంది కాని సువాసన ఉండదు.

ఇందుకు నిమ్మ , దానిమ్మలే ఉదాహరణలు. రెండూ పళ్ల చెట్లే; రెండూ పూస్తాయి. నిమ్మ పూలకు సువాసన ఉంటుంది. కాని రంగు ఉండదు. దానిమ్మ పూలకు రంగు ఉంటుంది. కాని సువాసన ఉండదు. పళ్ల చెట్ల పూలను పూవులనటం కంటే పూత అని ఎక్కువగా అంటారు.

దానిమ్మ పూలు చూడటానికెంత రమ్యంగా ఉంటాయో వాసన చూడటానికి అంత మధురంగా ఉంటాయి నిమ్మ పూలు.

పూల చెట్ల పూలకు మాత్రమే సాధారణంగా మంచి రంగు ఉంటుంది. కాని పళ్ల చెట్ల పూలకు ఉండదు రంగు.

దానిమ్మ పళ్ల చెట్టు. అయినా, దానిమ్మ పూలకు మంచి రంగు ఉంటుంది. దానిమ్మ పూలకంటే దానిమ్మ మొగ్గకు, అంటే అనార్కలీకి వర్ణశోభా, రూప విన్యాసం ఉన్నతంగా ఉంటాయి.

మణి దీపాల నెప్పుడూ చూడలేదు. మణులను మాత్రం చూచి ఉండవచ్చు. అనార్కలీని, దాని చుట్టూ ఉన్న ఆకుపచ్చని ఆకుల మధ్య చూస్తూ ఉంటే మధ్యాహ్నపు వెండి ఎండలో అనిపిస్తుంది మణి దీపం వెలుగుతూందా అని.

అసలు కొన్ని మొగ్గలు – కలువ మొగ్గ, తామర మొగ్గ, లిల్లీ మొగ్గ – పూవుగా వికసించకుండా ఎప్పటికీ మొగ్గగానే మిగిలి పోతే బాగుండునని!

ఇక అనార్కలీ సంగతి చెప్పనే అవసరం లేదు, ప్రత్యేకించి శీతాకాలపు గాఢ నీలగగనం క్రింద, రాత్రి తడిసిన మంచు బిందువుల మెరుపులో, సూర్యకిరణాల స్పర్శతో అనార్కలీ నిజంగా 'అనార్కలీ' అయి ఎర్రని సంగీతాన్ని వినిపిస్తూంటుంది, నిప్పుకణమై కాంతిని ప్రసరిస్తూంటుంది.

అనార్కలీని చూస్తున్నపుడు కలిగే ఆనంద కాంతిలో ఒక ప్రక్క భయంతో కూడిన ఛాయలు చూడా తొంగి చూస్తూనే ఉంటాయి. కారణం ఆ అనార్కలీ ఇపుడు విచ్చుతుందో పూవుగా, ఇంకొంచెం సేపటికి విచ్చుతుందో అని మనం భయపడటం వల్ల.

అది విచ్చితే 'అనార్కలీ'కి బదులు 'అనార్ ఫూల్' మాత్రమే కనిపిస్తుంది.

మొగ్గ విచ్చాలి, పూవు పూయాలి, పూవు ముదరాలి, కాయ కాయాలి, కాయ పండాలి, పండు పగలాలి అని నిరీక్షించే వారు చాలామంది. దానిమ్మపండు బాగా పండితే పగులుతుంది.

పండు కాయ కావాలి, కాయ పూవు కావాలి, పూవు మొగ్గగా ముకుళించాలి, తిరిగి అనార్కలీ కనిపించాలి అని రసహృదయాల నిరీక్షణ.

సహజవాంఛ వాస్తవ జగత్తులో తీరితే అసహజవాంఛ తీరుతుంది కల్పనా జగత్తులో.

ఇక పండు కాయగా, కాయ పూవుగా, పూవు మొగ్గగా కావటం చూడబడుతుంది భావ జగత్తులో, కవితా లోకంలో.

దానిమ్మ మొగ్గ అంటే అనార్కలీ. పగిలిన పండుగా మారి తినబడటంలో ఆనందం మొదటి వారికి లభిస్తే, పగిలిన పండు మొగ్గగా మారి అనార్కలీ రూపం తాల్చటం చూచి మానసంలో రెండవ వారికి వేస్తుంది ఆనందం, రసానందం.

మొదటి వారికి తమ విధానం తమకెంత నిజమో, రెండవ వారికి తమ విధానం కూడా తమకంతే నిజం. ఒకరిది వాస్తవ సత్యం, రెండవ వారిది కవితా సత్యం (Poetic Truth). దేని వలయంలో అదే నిజమైంది. కనుకనే ఒకరికి అనార్కలీ నిజమైతే, మరొకరికి పక్వమై పగిలిన అనార్ ఫల్ నిజం.

ఒకొక్క ఋతువులో ఒక్కొక్క శోభను సంతరించు కొంటుంది అనార్కలీ. రోజులోని ఒక్కొక్క సమయం ఒక్కొక్క కమనీయతను అందిస్తుంది అనార్కలీకి.

శరత్ సంధ్యలో పశ్చిమ దిగంతంలో ఇంకా లాలిమ అలముకొని ఉండగా ఆ లాలిమలో గుండా బంగారు సాంధ్యతార మెరుస్తూ కనిపిస్తుంది. ఇక్కడ దానిమ్మ చెట్టు కొసన అనార్కలీ సాంధ్యతారతో పోటీ పడుతుంది.

సాంధ్యతారలోని కాంతి అనార్కలీకి తగిలి ఇది వెలుగుతున్నట్లా లేక అనార్కలీ రక్తారుణిమ సాంధ్యతారలో ప్రతిఫలించి అది ప్రకాశిస్తున్నట్లా?

సంధ్యారుణ కాంతి నలుపులోకి ముదురుతున్నకొద్దీ గోధూళి వాతావరణం నిశారంభంలోని తొలి చీకటితో ఐక్యం అవుతున్నకొద్దీ అనార్కలీ దీపంగా మారుతూ వెలుగును వెదజల్లటం ఎక్కువైంది.

సాధారణంగా సాయం సంధ్యకూ, ఉదయ సంధ్యకూ మధ్య ఉన్న పగలులో ప్రతి గంటకూ వాతావరణంలో సూక్ష్మమైన మార్పు ప్రవేశిస్తూనే ఉంటుంది.

అటువంటి మారుతూన్న వాతావరణ వైఖరులను గుర్తించాలంటే వాతావరణాన్ని మాత్రమే చూచి గుర్తించలేం. ఒక నిలకడైన వస్తువులో కాని అటువంటి సూక్ష్మపరివర్తన కనిపించదు.

అటువంటి సూక్ష్మమైన ప్రాకృతిక ప్రభావం కనపడటంలో అనార్కలీ కంటే మించి సున్నితమైన వస్తువు మరేముంటుంది కనుక?

ఉదయాన్నే సూర్యోదయం కాక ముందే ఉషఃకిరణాలు పడమటకు పయనిస్తున్నప్పుడు, సుదూర క్షితిజరేఖలు ఇంకా చీకటి తెరలతో కప్పబడి ఉన్నప్పుడు, హేమంతపు హిమకిరణాలు అనార్కలీని

ముంచి ఉండగానే లేస్తుంది నిద్రనుంచి అనార్కలీ.

నిద్రించే అనార్కలీ మీద ఘనీభవించిన హిమబిందువులు ఆమె నిద్ర లేచేవరకు క్రిందికి జారిపోతాయి. దాని రంగు మంచుతో కప్పబడినందున, ఎండ లేకపోయినందున ఒక మృదుల కాంతితో తెర చాటు దీపం వలె అస్ఫుటంగా గోచరిస్తుంటుంది.

సూర్యుడు పైకెక్కి వచ్చే కొద్దీ అస్ఫుట రూపం ప్రస్ఫుట రూపంగా మారుతుంటుంది. గంట గంటకూ దాని కాంతి తీవ్రత హెచ్చుతూ మధ్యాహ్న సూర్యుని కిరణాల మధ్య అది చీకటి రాత్రిలోని కాగడా వలె మధ్యాహ్నపు వెలుగులో వెలిగిపోతుంటుంది.

మధ్యాహ్నపు సూటి సూర్యకిరణాల వల్ల అనార్కలీ మీద దానిచుట్టూఉన్న దాని, దేని నీడా పడదు. తన నీడ కూడ తన క్రిందకు పోతుంది కాని దేని మీద పడదు.

ఆ సమయంలో తన నీడ తన మీద ఉండదు. తన నీడ మీదనే తాను ఉంటుంది. పరిశీలించి చూస్తే రోజులోని ఏసమయంలో కూడ తన నీడ తన మీద పడదు. ఇతర్ల నీడ తన మీద పడుతుంది, తన నీడ ఇతర్లమీద పడుతుంది. మధ్యాహ్నపు సమయంలో మాత్రం తన నీడ తన క్రింద ఉంటుంది.

అనార్కలీని చూస్తుంటే పూర్వం లాహోర్‌లోని అనార్కలీ ప్రాంతంలో సంచరించిన స్మృతులు లేస్తుంటాయి. ఎర్ర పెదవులతో, నల్ల పాయ్‌జామాలతో, పసుపు కమీజ్‌లతో, నోట్లో సిగరెట్‌తో సైకిళ్లపై పోతున్న ముస్లిం విద్యార్థినుల జ్ఞాపకాలు జ్ఞాపకం వస్తాయి. వాళ్ల శరీర కాంతికీ, అనార్కలీ కాంతికీ చాలా సామ్యం కనిపించేది.

దానిమ్మచెట్టు మీది అనార్కలీని చూచినపుడల్లా వందల సంవత్సరాల వెనక్కుపోయిన సలీం-అనార్కలీల రహస్య ప్రణయ గాథలు మానస చక్షువుల ముందు ప్రత్యక్షమవుతాయి.

ఆనాటి అందాల అనార్కలీని ముందు ముందుగా కదలించి తన వశం చేసుకున్న సలీం బాగానే జీవించి ఉన్నాడు. కాని అమాయకురాలైన ఆ అందాల రాశి, ఆనందాల శశి, రాగ తరంగిణి, అనురాగ స్వరూపిణి అయిన అనార్కలీ మాత్రం సజీవ సమాధిగా రూపొందింది. అక్బర్ ఆజ్ఞ ద్వారా సలీం తన ప్రేయసి మరణాన్ని అంగీకరించాడు. కాని తండ్రిని ఎదిరించలేక పోయాడు. యుద్ధం నుంచి పారిపోవటం పిరికితనం కాదు. ప్రేమ నుంచి పారిపోవటం పిరికితనం.

సలీం అక్బర్ చక్రవర్తి కొడుకు. అనార్కలీ సామాన్యురాలు. ఆమెది తప్పు అయినా మరణదండన ఆమెకు చెందాలసిందే, సలీంది తప్పు అయినా ఆమెకు చెందాలసిందే! అధికార బలం ముందు న్యాయబలం తలవంగుతుంది.

వంచని ఉదాహరణలు కూడా ఉన్నాయి. కాని అవి అరుదుగా మాత్రమే ఉంటాయి.

ఆమె మరణానికి ముందున్న దానిమ్మ చెట్టు ఆమెతోపాటు మరణించి, దాని మొగ్గ అనార్కలీ ఆ మానవ అనార్కలీ కంకాళంతో కలసిపోయి ఆమె శరీర భాగాన్ని కొంత తీసుకొనివచ్చి ఇక్కడి మా తోటలోని మొలిచి మొగ్గ తొడిగిన నిత్యం అనార్కలీగా ప్రత్యక్షమవుతుం దేమో ఇక్కడ.

నాడు బ్రతికున్న సలీం నేడు చచ్చి ఉన్నాడు; నాడు చంపబడ్డ అనార్కలీ నేడు బ్రతికి ఉంది! అపుడు సలీం బ్రతికి ఉన్నందున ఎందరినో బ్రతకకుండా చేశాడు; సలీం - జహంగీర్ అయిన తరువాత కూడ తన చేతితో కొన్ని హత్యలు చేసి ఇతర్ల చేత ఎన్ని హత్యలో చేయించాడు. సలీం కారణంగా అయిన మొదటి ఆహుతి అనార్కలీయేనేమో!

ఇప్పుడు ఇక్కడ దానిమ్మచెట్టు మీద ప్రకాశిస్తున్న అనార్కలీని ఎవరూ హత్య చేయరు. తగు కాలంలో పండు అయే విధానంలో తానే స్వయంగా ఆహుతి అవుతుంది. ఆ ఆహుతి కేవలం రూపం ఆహుతి మాత్రమే కాని ప్రాణాహుతి మాత్రం కాదు. మొగ్గ రూపం పండు రూపంలోకి పరిణతి చెందుతుంది. కనుక అది రూపాంతరమే కాని మొగ్గ మరణం కాదు.

అనార్కలీ కొంతకాలం రస హృదయా లకు ఆనంద గానంచేసి తరువాత పరి ణామ మార్గంలో పండుగా మారి ఇంకా ఎక్కువమందికి ఆహార దానం చేస్తుంది. అనార్కలీగా ఉండి ఎందరి కళ్లకో రసాన్ని పంచిపెట్టిన మొగ్గ పండు రూపంలో ఎందరి నోటికో తిరిగి రసాన్ని పంచిపెడు తుంది – దానిమ్మ రసాన్ని.

అయినప్పటికీ అనార్కలీ అస్తిత్వం అంతటితో నశించిపోదు. దానిమ్మ చెట్టుకు అనార్కలీ లోటు లేదు. ఒక మొగ్గ కాయవుతుంటే మరో మొగ్గ ప్రత్యక్ష మవుతుంటుంది.

అనార్కలీ అమరజ్యోతిగా వెలుగు తూనే ఉంటుంది - వానలో వరదల్లో, ఎండలో మంచులో, చీకటిలో, వెన్నెల్లో.

మిగతా వాతావరణాల్లో కనిపించే అనా ర్కలీ కంటే వర్షధారల మధ్య కనిపించే అనార్కలీ కొంత వింత దృశ్యంగా ఉంటుంది. అది చల్లని వర్షధారలను ఆనందించటంతో తన్మయి అయి తన రూపాన్నే విస్మరించినట్లు గోచరిస్తుంది.

వర్షధారల మధ్య దాని రూపం అస్ప ష్టంగా, బూజు బూజుగా, దాని రంగు పాలిపోయినట్లు పేలవంగా, వర్షధారల వేగానికి అది అటు ఊగుతూ ఇటు కదలుతూ, ఉత్తర దక్షిణాలకు, తూర్పు పడమరలకు, పైకీ క్రిందికీ నర్తనశీలి అయి ప్రకంపిస్తుంది.

మిగతా కాలాల్లో కంటే వేసవిలో దాని మనుగడ దానికే అంత సుఖంగా ఉన్నట్లు కనిపించదు. ఆ వేడి పడమటి గాల్పులకు అది పగలే నిద్రిస్తున్నట్లు కనిపిస్తుంది. పగలు నిద్రిస్తుంది కనుక రాత్రుల్లో మేల్కొంటుందా! అంటే అదీ కనిపించదు.

వడగాల్పులతో, దివారాత్రుల నిద్రతో ఆహారం సరీగా తినక, నీరు త్రాగటం ఎక్కువై ఆకృతిలో దుర్బలంగా కనిపించక పోయినా, ఏదోగా నీరసంగా, నిస్తేజంగా, నిస్పృహగా కనిపిస్తుంది; కాని అది రాలి పోదు. వాడి పోతుంది. కాని అనార్కలీకి కష్టకాలం అది.

ఎండలతో మండే ఉష్ణ దేశాలకు వెన్నెల ఒక గొప్ప వరం. దాని చల్లదనం, ముత్యపు చిప్పలాంటి దాని మృదువైన పండిన తెల్లదనం, సుదూర క్షితజాల దగ్గరి చెట్లను అది చూపే తీరు - ఇవన్నీ వెన్నెలకు మాత్రమే సాధ్యమేమో!

వెన్నెల్లో తాజ్‌మహల్‌ను ఆనందిం చటం అని ఒక వాడుక ఉన్నది. వెన్నెల్లో ఒక తాజ్‌మహల్ ఏమిటి, ఎన్నో మహ ల్‌లు, మహల్‌లు కానివి కూడ సుందరం గానే గోచరిస్తాయి. పగలు అసుందరంగా గోచరించేవి కూడ వెన్నెలలోని ఇంద్రజా లిక స్పర్శతో అతి మనోజ్ఞంగా గోచరి స్తాయి.

కాని ప్రత్యేకించి అనార్కలీని చూడాలి వెన్నెల్లో; పూర్ణిమ నాటి నిండు వెన్నెల్లో కాదు, పండు వెన్నెల్లో కాదు, నవమి నాటి రాత్రి వికసించని వెన్నెల్లో. అటు వంటి లేత వెన్నెల్లో ఒక కమనీయత ఉంటుంది, ఒక నమనీయత ఉంటుంది దూరం నుంచి వినిపిస్తున్న పిల్లనగ్రోవి రాగం వలె.

అనార్కలీ రంగుకు ఆ వెన్నెల ఒక మెరవని మెరుపును కలిగిస్తుంది, దాని రూపానికొక స్వాప్నిక శోభను కల్పి స్తుంది. ఆ వెన్నెల్లో అనార్కలీని చూస్తుంటే సుగంధం లేని ఆ దానిమ్మ మొగ్గనుండి ఏదో సుగంధం తడుతున్న భ్రాంతి జనిస్తుంది. దానిలో నుండి ఏదో మౌన సంగీతం వినిపిస్తున్న భ్రమ, అనుభూతం అవుతుంది. వెన్నెల్లోని అనా ర్కలీ ఒక వెన్నెల మొగ్గ.

అదొక చెట్టుమీద నక్షత్రం!

దానిమ్మ చెట్టుకు అన్ని చెట్లకున్నట్లే వేళ్లూ, కొమ్మలూ, రెమ్మలూ, రెబ్బలూ, ఆకులూ ఉంటాయి. కాని అన్ని చెట్లల్లో లేని అనార్కలీ దానిలో ప్రత్యక్షం. చెట్టు తాను ప్రసవించిన అనార్కలీని చూచి ఎంత సంతోషిస్తుందో, ఎంత గర్విస్తుందో తెలియదు. అసలు అనార్కలీ స్వయంగా తన స్వీయ శోభను ఎంతవరకు ఆనందిస్తుందో తెలియదు.

అది ప్రకృతిలోని ఒక దీప్తి. సుప్త చేతనను మేల్కొల్పే ఉద్దీపనల్లో అనార్కలీ ఒక సుందర సందీపన!.

> 'He who does not allow his miracles to be investigated is a crook, he who does not have the courage to investigate a miracle is a gullible, and he who is prepared to believed without varification is a fool.'

MISIMI/మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 02

Postal Regd. No.H/SD/191



Printed at KALA JYOTHI PROCESS Pvt. Ltd.
Multicolour Offset Printers & Phototypesetters.
1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.